teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 117 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 22 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## స్థానిక సంస్థలకు రూ.283.65 కోట్ల రూ. రిలీజ్

### మిగతా నిధులను దశల వారీగా రిలీజ్ చేయనున్న ప్రభుత్వం

### త్వరలో ఎలక్షన్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రూ.283.65 కోట్లను ప్రభుత్వం రిలీజ్ చేసింది. ఆ నిధులు గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లకు అందాయి. ఇందులో గ్రామ పంచాయతీలకు రూ. 241.11 కోట్లు, మండల పరిషత్ లకు రూ. 28.36 కోట్లు, జిల్లా పరిషత్ లకు రూ.14.18 కోట్లు

మిగతా 2 లో




# సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఖాళీలను భర్తీ చేయండి

### పెద్ద కార్యాలయాలలో తప్ప సీనియర్ అసిస్టెంట్ లేరు..?

### 13 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఉన్న సీ"అసిస్టెంట్లు ఎంత మంది

### ఉద్యోగుల్లో "అధిక పని భారం" ఒత్తిడి ఆనవాళ్లు

### కార్యాలయాల్లో "ఆలస్యం" ప్రజలకు అసౌకర్యం

**ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో సరైన సిబ్బంది లేకపోవడం వల్ల ఆఫీస్ కు వచ్చిన వారికి సేవలను పొందటం కష్టంగా మారిందన్న అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ తో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది ఉండాలని ప్రజలు కోరుతున్నారు.**

హన్మకొండ, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఒకటి రెండు కార్యాలయలాలో మినహా ఎక్కడ సీనియర్ అసిస్టెంట్ లేకపోవడం వలన పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ ఉన్నట్లయితే పని భారం తగ్గి కార్యాలయానికి వచ్చే ప్రజలకు తక్కువ సమయంలో సేవలను ఇవ్వడం జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. వరంగల్ పోర్ట్, హన్మకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మినహా జిల్లాలో మిగిలిన 13 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఎక్కడ

మిగతా 2 లో

# భూ సమస్యల పరిష్కారానికి కొత్త రెవెన్యూ చట్టం

## ఈ నెల 23, 24న రెవెన్యూ ముసాయిదాపై వర్క్ షాప్‌లు

### ఎల్ఆర్ఎస్ పర్యవేక్షణకు డిప్యూటీ కలెక్టర్లకు బాధ్యతలు

### ధరణి సమస్యలపై ఇప్పటికే కమిటీ ఏర్పాటు

### భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగకరమైన చట్టం తెస్తాం

**భూ రిజిస్ట్రేషన్ల పేరిట దందా చేస్తున్నారని అవినీతిని అరికట్టేందుకు వీఆర్ఓ వ్యవస్థను రద్దు చేసి ధరణి పోర్టల్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అవినీతికి ఆస్కారం లేకుండా భూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయని గత ప్రభుత్వం తెలిపింది. ధరణి పోర్టల్ లోపభూయిష్టకరంగా ఉందని తాము అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ హామి ఇచ్చింది. ఆ మేరకు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధరణి పోర్టల్‌పై ఓ కమిటీని ఏర్పాటు చేసింది. దేశానికి ఆదర్శంగా ఉండేలా కొత్త రెవెన్యూ చట్టం తీసుకువస్తామని అంటోంది. భూమి చిక్కులు లేకుండా రైతుల కోసం ఆదర్శవమంమైన నూతన రెవెన్యూ చట్టం తీసుకువస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.**

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): చట్టాలు సక్రమంగా చేయకపోతే వాటి ఫలితాలు ఎలా ఉంటాయో గత ప్రభుత్వం తీసుకువచ్చిన రెవెన్యూ చట్టమే అందుకు నిదర్శనమని ఆరోపించారు. గతంలో మాదిరిగా కాకుండా ఒక రోజు ఆలస్యం అయినా సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఎలాంటి

మిగతా 2 లో






# ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై దేశవ్యాప్తంగా బంద్

### పలుచోట్ల రైళ్ల రాకపోకలను అడ్డుకున్న ఆందోళనకారులు

### వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు

న్యూ ఢిల్లీ, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా బంద్ కొనసాగుతోంది. పలుచోట్ల ఆందోళనకారులు రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. జాతీయ రహదారులపై బైఠాయించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫలితంగా ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి. ఇటీవలే సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీల ఉప వర్గీకరణకు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్

మిగతా 2 లో

# నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రాకు ఉన్న అధికారాలేంటి..?

### రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తెలంగాణ హైకోర్ట్

### హైడ్రా చర్యలపై స్టే ఇవ్వలేమని కోర్టు స్పష్టం

హైదరాబాద్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): జన్వాడ ఫామ్‌హౌస్‌ను కూల్చివేయకుండా స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైడ్రా చర్యలపై స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే జీవో 99 ప్రకారం నడుచుకోవాలని హైడ్రాను కోర్టు ఆదేశించింది. జన్వాడ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన పత్రాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. అంతకుముందు నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రాకు ఎలాంటి అధికారాలు ఉన్నాయని రాష్ట్ర హైకోర్టు బుధవారం నాడు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నగరానికి చెందిన రియల్టర్ బి ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్‌తో కూడిన సింగిల్ బెంచ్ విచారణ చేపట్టింది. రంగారెడ్డి

మిగతా 2 లో






# అమ్మాయిలు.. మహిళలు మీ వద్ద ఈ యాప్ ఉందా..?

### ఆడవారి భద్రత కోసం "సీఎం రేవంత్ రెడ్డి" టీ సేఫ్ యాప్

### అపాయాన్ని గుర్తించి పోలీసులకు చేరవేయడమే దీని పని

### ప్రతీ అక్కా.. చెల్లి ఈ యాప్ గురించి తెలుసుకోవాలి

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): అమ్మాయిలు, మహిళల భద్రత కోసం సీఎం రేవంత్ రెడ్డి మార్చి 12, 2024లో, టీ సేఫ్ అనే యాప్ ను లాంచ్ చేశారు. ఇప్పటివరకు 15,000 మందికిపైగా మహిళలు ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకున్నారు. మహిళల ప్రయాణ

మిగతా 2 లో



# డ్వాక్రా మహిళలకు రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

### వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇస్తాం

### డ్వాక్రా మహిళలలనుద్దేశించి డిప్యూటీ సీఎం కీలక ప్రకటన

హైదరాబాద్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ మహిళలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభవార్త చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీలేని

మిగతా 2 లో

## తెలంగాణ ముక్తి దివస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం

### కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సికింద్రాబాద్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): సెప్టెంబర్ 17న రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ముక్తి దివస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్ క్లాసిక్ గార్డెన్స్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంతో రజాకార్ల నుంచి తెలంగాణకు విమోచనం కలిగిన రోజును ముక్తి దివాస్ గా జరుపుకోవాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. రాష్ట్రంలో మెజరిటీ ప్రజలకు బీజేపీయే అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. చైనాలోని కమ్యూనిస్టు పార్టీని మించిన అతిపెద్ద పార్టీ బీజేపీ అని కిషన్‌రెడ్డి తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదులో ప్రతిఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు.




# పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం మందడుగు

### ఓటరు జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల

### సెప్టెంబర్ 6న ప్రచురించునున్న ముసాయిదా ఓటరు జాబితా

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం మందడుగు వేసింది. ఓటరు జాబితా తయారీకి సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబర్

మిగతా 2 లో

### కేయు అన్యాక్రాంత భూముల సర్వే

# ఆపేయడంపై అనుమానాలు

### ఇన్‌చార్జి వీసీ చొరవతోనే వర్సిటీ భూముల రక్షణ సాధ్యం

### విశ్వాసం కోల్పోతున్న విద్యార్థులు, సంఘాలు



హన్మకొండ కేయూ, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీకి చెందిన రూ.కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతం కాగా వాటిని కాపాడుకునేందుకు నెల రోజుల కింద చేపట్టిన ఫిజికల్ సర్వే మొదట్లోనే ఆగిపోయింది. కొన్నేండ్ల

మిగతా 2 లో

# జన్ పోషణ్ కేంద్రాలుగా "మారనున్న" రేషన్ షాప్స్

### అందుబాటులోకి రానున్న విభిన్న పోషక ఉత్పత్తులు

### ఈ మేరకు మోదీ సర్కార్ ప్రకటన

న్యూ ఢిల్లీ, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): దేశంలోని పేదలకు మోదీ సర్కార్ శుభవార్త చెప్పింది. రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా మార్చబోతున్నట్లు ప్రకటించింది. బియ్యం, ఉప్పు, పప్పులతో పాటు విభిన్న రకాల పోషక ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపింది. ఈ మేరకు లబ్ధిదారులకు పోషకాలు అందించడంతోపాటు రేషన్ షాప్ డీలర్ల ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించినట్లు కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 60 రేషన్ షాపులను జన్ పోషణ్ కేంద్రాలుగా ఇందులో భాగంగానే మేరా రేషన్ యాప్ అప్‌గ్రేడ్ వెర్షన్‌ను పరిచయం చేసిన జోషి. తెలంగాణ, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రాంతాల్లోని 60 రేషన్ షాపులను జన్ ఫోషణ్ కేంద్రాలుగా మార్చనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఎఫ్‌పీఎస్‌లు 8- 9 రోజులు మాత్రమే తెరుస్తున్నారు. మరికొన్ని 3 నెలలకు ఒకసారి మాత్రమే పనిచేస్తాయి. మిగతా టైమ్ లో దుకాణాలు అందుబాటులో ఉండట్లేదు. దీంతో డీలర్లకు కమీషన్లు సరిపోవట్లేదు. దీనికి ప్రత్యామ్నాయం కోసం కొత్త విధానాలు ప్రవేశపెట్టాల్సి ఉందని జోషి అన్నారు. ఈ దుకాణాల్లో రోజువారీ నిత్యవసర సరుకులైన చిరుధాన్యాలు, పప్పులు, పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. అదే విధంగా డీలర్ల అదనపు ఆదాయాలకోసం ఎఫ్ఎంసీజీ విభాగంలో మొత్తం 3,500 ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికీ దేశంలో 5.38 లక్షల ఎఫ్‌పీఎస్‌లు వినియోగంలో ఉన్నాయి.

# సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో "ఖాళీలను" భర్తీ చేయండి

మొదటి పేజీ తరువాయి

సీనియర్ అసిస్టెంట్ పోస్ట్ లేదని సమాచారం. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఉండడం వలన కార్యాలయంకు రిజిస్ట్రేషన్ కోసం వచ్చే ప్రజలకు సమాచారం ఇచ్చిపుచ్చుకోవడంతో పాటు సాంకేతిక పరమైన అంశాలను చర్చించి వారిలో ఉన్న అపోహలను తొలవించి రిజిస్ట్రేషన్ కు సన్నద్ధం చేసే అవకాశం ఉంటుందని కొంతమంది ఉద్యోగులు తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సబ్ రిజిస్టర్ సెలవులపై వెళ్ళినప్పుడు ఆ బాధ్యతలను సీనియర్ అసిస్టెంట్ సమర్థవంతంగా చేపట్టి నిర్వహించే అవకాశం కూడా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇటీవల జిల్లాలోని నర్సంపేట, జనగాం, వరంగల్ రూరల్ కార్యాలయాలలో జూనియర్ అసిస్టేట్లు ఇంచార్జి బాధ్యతలను నిర్వహించిన విషయం తెలిసిందే. సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ చేసే బాధ్యతలను అప్పగించవద్దన్న నిబంధనలు ఉన్నాయి, ఐనా వాటిని జిల్లాలోని సబ్ రిజిస్టార్లు పాటించిన సందర్భాలు లేవని ప్రజలు గుర్తు చేస్తున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పజెప్పవద్దన్న నియమ నిబంధనలు ఉన్నాయని కొంతమంది సబ్ రిజిస్ట్రార్ ల ద్వారా వినిపిస్తున్న సమాచారం. ఈ క్రమంలో కార్యాలయంలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండాలంటే సీనియర్ అసిస్టెంట్ నియామకాన్ని చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 2007వ సంవత్సరంకు ముందు ఉండబడిన పెద్ద కార్యాలయాలలో తప్ప ఎక్కడ సీనియర్ అసిస్టెంట్ లేరన్నారు. 2007 తర్వాత ఏర్పడిన వరంగల్ పోర్ట్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఉన్నారని, అదేవిధంగా మిగిలిన కార్యాలయాలలో లేకుండా పోయారని అధికారులు చర్చించుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో సీనియర్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టి భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై దేశవ్యాప్తంగా బంద్

మొదటి పేజీ తరువాయి

సారథ్యంలో ఏర్పాటైన ఏడుమంది సభ్యుల ధర్మాసనం ఈ మేరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతుల్లో మరింత వెనుకబడిన వారికి ప్రత్యేక కోటాలను మంజూరు చేయొచ్చంటూ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను రాష్ట్రాలు చేయొచ్చని స్పష్టం చేసింది. కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని స్పష్టం చేసింది. దీనిపై 2004లో అయిదుమంది న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. దీన్ని నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి నాయకులు భారత్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్రాలు ముందుకు వెళ్లకూడదని డిమాండ్ చేస్తోన్నారు. రిజర్వేషన్లల్లో ఇప్పుడు ఉన్న కోటాను యథాతథంగా కొనసాగించాలని, ఇందులో ఎలాంటి మార్పులూ చేయకూడదని పట్టుబట్టారు. ఉత్తరాది రాష్ట్రాలపై బంద్ ప్రభావం కనిపించింది. బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆందోళనకారులు వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. నిరసన ప్రదర్శనలను నిర్వహిస్తోన్నారు. రోడ్లపై బైఠాయించారు. కొన్ని చోట్ల ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేశారు. బిహార్‌లోని జెహనాబాద్‌లో ఆందోళనకారులు భారీ సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. ఫలితంగా పెద్ద ఎత్తున వాహనాల రాకపోకలు స్తంభించాయి. వారిని నిలువరించడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి నాయకులు, ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. సందర్భంగా తోపులాట చోటు చేసుకుంది. అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులతో వాళ్లు వాగ్వివాదానికి దిగారు. అరెస్ట్ చేయడాన్ని తప్పుపట్టారు. ఈ బంద్‌కు భీమ్ సేన్ ఆర్మీ, జైభీమ్ సంఘాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి తన సంఘీభావాన్ని తెలియజేశారు. తెలంగాణ, ఏపీ,తో పాటు పలు రాష్ట్రాల్లో బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఢిల్లీలోనూ అంతంతమాత్రమే. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు యథాతథంగా పని చేశాయి. వాహనాల రాకపోకలకూ పలు రాష్ట్రాల్లో పెద్దగా ఆటంకం కలగలేదు. ఈ వర్గీకరణ వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురు లబ్ధి పొందగులుగుతారు.

# పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు

మొదటి పేజీ తరువాయి

6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచూరిస్తారు. సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు దీనిపై అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. ఇక 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. చివరికి సెప్టెంబర్ 21న వార్డుల వారీగా చివరి జాబితాను ప్రచూరిస్తారు. ఈ నేపథ్యంలో ఓటరు జాబితా తయారీపై సెప్టెంబర్ 29న కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది.

**స్థానిక సంస్థలకు రూ.283.65 కోట్ల రూ. రిలీజ్**

రిలీజ్‌అయ్యాయి. కాగా, గ్రామ పంచా యతీల్లో గత ఐదేండ్ల నుంచి పెండింగ్ బకాయి లు ఉండగా ఈ నిధులతో కొన్ని బిల్స్ క్లియర్ అయినట్టు అధికారులు చెప్తున్నారు. మిగతా నిధులను దశల వారీగా ప్రభుత్వం రిలీజ్ చేయనుంది. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగియగా అప్పటి నుంచి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఆగిపోయాయి. 6 నెలల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా ఎంపీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికలు జరగలేదు. త్వరలో ఎలక్షన్స్ నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

# అమ్మాయిలు.. మహిళలు మీ వద్ద ఈ యాప్ ఉందా..?

మొదటి పేజీ తరువాయి

సమయంలో, పని ప్రాంతాల్లో వారి భద్రత కోసం ఈ యాప్ పనిచేస్తోంది. అపాయంలో ఉన్న మహిళలను గుర్తించి వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకునేలా ఈ యాప్ పనిచేస్తోంది. స్మార్ట్ ఫోన్ లో కాకుండా, సాధారణ ఫోన్ల ద్వారా కూడా టీ సేఫ్ వాడొచ్చు. మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నా ఈ యాప్ ను అభినందిస్తూ హీరో మాధవన్ టీ సేఫ్ ప్రచార వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. కోల్‌కత్తా మహిళా డాక్టర్ హత్య నేపథ్యంలో టీ సేఫ్ దేశ వ్యాప్తంగా మరోసారి చర్చలోకి వచ్చింది. టీ సేఫ్ యాప్ ను తమ రాష్ట్రంలో ప్రారంభించేందుకు ఏడు రాష్ట్రాలు ముందు కొచ్చాయి. ఇతర రాష్ట్రాలకు టీ సేఫ్ యాప్ ఆదర్శంగా మారటం, ప్రముఖ హీరో మాధవన్ తన ఎక్స్ అకౌంట్లో వీడియోను అప్లోడ్ చేసి ప్రమోట్ చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. అమ్మాయిలు మహిళలు ఈ యాప్ ను వినియోగించాలని సూచించారు. మరింతగా ఈ యాప్ ను వినియోగం లోకి తేవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాగా అవగాహనా రాహిత్యం వల్ల చాలా మంది అమ్మాయిలు, మహిళలు ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేసుకోవడం లేదు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆడపడుచులు అందరూ తప్పకుండా ఈ యాప్ ను వినియోగించాలి. ప్రస్తుతం వనితల భద్రత కత్తిమీద సాములా మారింది. ఓ కంట కనిపెట్టుకుని ఉన్నప్పటికీ ఎక్కడో ఒక చోట కీచకుల చేతికి చిక్కి బలవుతున్నారు. అందుకని ఈ యాప్ ను మీరు డౌన్ లోడ్ చేసుకోవడంతో పాటు పది మందికి అవగాహన కల్పించాలి. ఇంట్లో కూర్చొని చేసే ఈ స్వల్ప సాయం వల్ల రేపటి రోజున ఏదో ఒక చెల్లిని రక్షించిన వాళ్లమవుతాం. రామవారధి నిర్మాణంలో ఉడుత సాయంలా ఈ యాప్ గురించి ప్రతిఒక్కరికి తెలిసేలా చేద్దాం. మన సామాజిక కర్తవ్యాన్ని పూర్తి చేద్దాం.

# ప్రభుత్వ పాఠశాలలు మూతపడుటకు కారణం విద్యాధికారులే..?

### ఆశ్చర్యానికి గురిచేస్తున్న పరకాల ఎంఈఓ మాటలు..!

### కనీస వసతులు లేకపోయినా అనుమతులు ఎలా ఇస్తున్నారు

### నియంత్రణలో ఉన్నప్పటికి నిబంధనల అమలుపై శ్రద్దేది

మారపెల్లి క్రాంతి కుమార్ బిఎస్ఎస్ అధ్యక్షులు

పరకాల, ఆగస్ట్ 21 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించబడుతున్నవని మారపెల్లి క్రాంతి కుమార్ బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పరకాల మండల విద్యాధికారినికి పిర్యాదు చేస్తే కనీసం పట్టించుకోకుండా, ప్రైవేట్ పాఠశాలలపై ఎప్పటికప్పుడు సందర్శించకుండా, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకుండా, ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యాధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలకు సహకరించడమే లేదా వైఖరి ప్రదర్శించడమే ప్రభుత్వ పాఠశాలలు మూసివేతకు ప్రధాన కారణమని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీ, కనీస సౌకర్యాలు లేకుండా, పేరెంట్స్ కమిటీలు లేకుండా, పక్కా భవనాలు, ఆట స్థలాలు, ఫైర్ సేఫ్టీ, పార్కింగ్ ప్లేస్ లు లేకుండా పూర్తి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నప్పటికీ ఇవన్నీ తెలిసిన విద్యాశాఖ అధికారులు ఎందుకు వాటిపైన చర్యలు తీసుకోవడం లేదు, చర్యలు తీసుకోకపోవడానికి ప్రైవేట్ పాఠశాలలకు విద్య అధికారులకు మధ్య సంబంధం ఏంటో అర్థం కావడం లేదు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరుచుకోకుండా పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకున్నట్లయితే, విద్యా నిబంధనలు అమలు పరిచినట్లయితే ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్యను పెంచుకొని ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావచ్చని ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు విరుద్ధంగా పరకాలలో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై తక్షణమే విచారణ జరిపించి పేద విద్యార్థులకు, న్యాయం చేయాలని ఈ సందర్భంగా అన్నారు.



### ఆశ్చర్యానికి గురిచేస్తున్న పరకాల ఎంఈఓ మాటలు..!

పరకాల పట్టణ కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ పాఠశాలపై ఫిర్యాదు చేసిన సందర్భంలో ఆ పాఠశాల పైన ఏం చర్యలు తీసుకున్నారు అని ఫిర్యాదుదారుడిగా ఎంఈఓని ఫోన్ ద్వారా అడగగా పరకాలలో చాలా స్కూల్స్ అలానే నడుస్తున్నవి మీరు అన్ని స్కూల్స్ పైన ఫిర్యాదు చేయండి యాక్షన్ తీసుకుంటామని వివరణ ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో ఇట్టి అధికారికి ముందే ఈ విషయాలు తెలుసా.. తెలిసినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు.. ప్రభుత్వ విద్యాధికారులకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై ఫిర్యాదు చేస్తేనే పట్టించుకుంటారా? ఇన్ని సంవత్సరాల కాలంగా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహించారు అని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి అని క్రాంతికుమార్ అన్నారు. ఇప్పటికైనా ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిజాయితీగా నిర్వర్తిస్తే పేద విద్యార్థులకు, మరియు వారి తల్లిదండ్రులకు వారి కలలను నిజం చేసిన వారవుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.

# భూ సమస్యల పరిష్కారానికి కొత్త రెవెన్యూ చట్టం

మొదటి పేజీ తరువాయి

ఇబ్బందులు కలగకుండా ఉండేలా చట్టాన్ని రూపొందిస్తున్నామన్నారు. 23, 24 తేదీల్లో రెవెన్యూ ముసాయిదాపై జిల్లాల్లో వర్క్ షాప్‌లు నిర్వహించనుంది. ఆయా జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి నూతన రెవెన్యూ చట్టం ముసాయిదాపై వివిధ రంగాల మేధావులతో వర్క్ షాప్ నిర్వహించాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. %ూ=ూ% పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌లకు అప్పగించింది. ఇదిలా ఉండగానే ధరణి ధరఖాస్తుల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. పది రోజుల్లోగా ప్రభుత్వం వద్దకు వచ్చిన అప్లికేషన్ల పరిష్కారానికి నిర్ణయం తీసుకుంది. ధరణి సమస్యలపై గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తులతో పాటు ఇటీవల కొత్తగా వచ్చిన అప్లికేషన్లను పదిరోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. తిరస్కరించిన దరఖాస్తులకు సరైన కారణాలను తెలియజేయాలని సూచించారు. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్



జిల్లాల్లో దరఖాస్తులు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు. లక్షాలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చే లే అవుట్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

LRS ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌ను పర్యవేక్షణ అధికారిగా నియమించాలని సీఎస్‌కి మంత్రి సూచించారు. LRS కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వకుంటే... ఇప్పుడు మళ్లీ తీసుకుని వాటిని LRS కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద మొదటి దశలో వంద LRS దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఇందులో ఎదురయ్యే మంచి చెడులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవాలని అధికారులను సూచించారు.

# నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రాకు ఉన్న అధికారాలేంటి..?

మొదటి పేజీ తరువాయి

జిల్లా మండలం శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలోని సర్వే నంబర్ 311/పార్ట్ న్యూ సర్వే నంబర్ 311/7లో 1210 చదరపు గజాల స్థలంలో 3,895.12 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భవనాన్ని కూల్చివేయవద్దని ప్రదీప్‌రెడ్డి తన పిటిషన్‌లో హైకోర్టును ఆశ్రయించారు. 15 నుంచి 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నిర్మాణాలను అక్రమ నిర్మాణమని పేర్కొంటూ కూల్చివేయడంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పరిధిని వివరించాలని అదనపు ఏజీని జస్టిస్ లక్ష్మణ్ ఆదేశించారు. మరోవైపు, హైడ్రా కూల్చివేతలపై కూడా హైకోర్టు ప్రశ్నించింది. భూ యజమానులు తమ భూములను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొంది. హైడ్రా స్వతంత్ర ప్రభుత్వ సంస్థ అని, అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అధికారం దానికి ఉందని అదనపు ఏజీ కోర్టుకు తెలియజేశారు. హైడ్రా అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సమయంలో ప్రదీప్ రెడ్డి ఒక పిటీషన్‌తో హైకోర్టు మెట్లెక్కాడు. తన ఆస్తిపై (ఫామ్‌హౌస్, అతను జీ%ష%ఒ 111లో కలిగి ఉన్నాడు)పై హైడ్రా ఎలాంటి చర్య తీసుకోకుండా నిరోధించాలని కోర్టును అభ్యర్థించాడు. అతను ఆస్తి యొక్క యాజమాన్యాన్ని క్లెయిమ్ చేశాడు. తన ఫామ్‌హౌస్‌కు రాజకీయ నాయకుడితో ఎలాంటి సంబంధం ఉందని, దుర్మార్గపు ప్రయోజనాల కోసం ప్రభుత్వం దానిని నాశనం చేస్తుందనే భయాన్ని ప్రదీప్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన తన పిటిషన్‌లో హైడ్రా కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చారు. రక్షిత ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్లలో భాగమైన జిఓ 111 ప్రాంతంలో అక్రమంగా ఫామ్‌హౌస్‌ను నిర్మించారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి, అప్పటి ఎంపి రేవంత్‌రెడ్డి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో పిటిషన్ దాఖలు చేయడంతో వివాదం ప్రారంభమైన విషయం గుర్తుండే ఉంటుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కెటి రామారావు (కెటిఆర్)కి చెందిన ప్రైవేట్ ఆస్తికి డ్రోన్‌ను ఎగుర వేసినందుకు రేవంత్ రెడ్డిపై కూడా కేసు నమోదైంది. స్థలాన్ని పరిశీలించి నివేదికను అందించడానికి ఆదేశంతో ఎన్‌జిటి సంయుక్త కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రదీప్ రెడ్డి స్పందిస్తూ హైకోర్టు అప్పీలులో తన నిర్మాణాలు చట్టబద్ధమైనవని పేర్కొన్నారు. ఎన్జీటీ ఆదేశాలను కొట్టివేయాలని ప్రత్యేక కేసులో కేటీఆర్ హైకోర్టును కోరగా, తిరస్కరించబడింది. అయితే ఎన్జీటీ ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే ఇచ్చింది. ఈ ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు (కెటిఆర్) తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో స్పందించారు. నాకు సొంతంగా ఫామ్‌హౌస్ లేదని చాలా స్పష్టంగా చెబుతున్నాను. నా స్నేహితుడి దగ్గర లీజుకు తీసుకున్నాను. ఆస్తి నిబంధనలను ఉల్లంఘించి, ఫుల్ ట్యాంక్ లెవెల్ లేదా బఫర్ జోన్ కిందకు వస్తే. హైడ్రా సర్వే నిర్వహించి తగిన చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాను అని కేటీఆర్ అన్నారు.

# జీహెచ్ఎంసీపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించనున్న ఆమ్రపాలి

హైదరాబాద్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇకనుంచి జీహెచ్ఎంసీపై పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటి వరకు ఆమెకు జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగానూ అదనపు బాధ్యతలున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో జీహెచ్ఎంసీపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారనే అభిప్రాయాలున్నాయి. తాజాగా ఆమెను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా బాధ్యతల నుంచి రిలీవ్ చేయడంతో రెగ్యులర్ కమిషనర్‌గా ఇక బల్దియాపై పట్టు సాధించనున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి దాకా పలు అంశాల్లో కొందరు అధికారులు ఆమ్రపాలిని తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వెలువెత్తాయి. ఇటీవల కొన్ని విభాగాల్లో బదిలీలు, శేరిలింగంపల్లి జోన్‌లో ఇంజినీర్ల



కొట్లాటలో ఒక్కరిపైనే చర్యలు, తదితరమైనవి అందుకు ఊతమిచ్చాయి. ఏళ్ల తరబడిగా సీట్లకు అంటుకుపోయిన వారు కదలకపోవడం.. పేరుకు బదిలీ తప్ప కొందరు అదే ప్రాంతంలో కొనసాగుతుండటం వంటివి అందుకు దృష్టాంతాలు. ఇతర విభాగాల బాధ్యతలున్నందున జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల, అన్ని స్థాయిల అధికారులకు తగినంత సమయమిచ్చేందుకు వీలు కాలేదని చెబుతున్నారు.

# కేయు అన్యాక్రాంత భూముల సర్వే ఆపేయడంపై అనుమానాలు

మొదటి పేజీ తరువాయి

నుంచి కేయూ ఆక్రమణల విషయంలో వివాదం నడుస్తుండగా ఇప్పుడు ఫిజికల్ సర్వే నిలిపివేయడం వెనక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కబ్జాదారుల్లో వర్సిటీ, పోలీస్, మున్సిపల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఆఫీసర్లు, పొలిటికల్ లీడర్లుండడంతో అక్రమార్కులకు వంత పాడుతున్నారనే విమర్శలున్నాయి.

**ఆఫీసర్లు, పొలిటికల్ లీడర్ల హస్తం**

కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటు సమయంలో హనుమకొండ మండలంలోని కుమార్‌పల్లి, లష్కర్ సింగారం, పలివేల్పుల గ్రామాల పరిధిలో 673.12 ఎకరాల భూమిని సేకరించారు. కానీ, వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్న ప్రాంతం కావడం, క్యాంపస్ చుట్టూ సరైన రక్షణ లేకపోవడంతో కుమార్ పల్లి శివారులోని 229, పలివేల్పుల శివారులోని 412, 413, 414, లష్కర్ సింగారంలోని 34 సర్వే నంబర్లలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. దీనిపై విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మూడేండ్ల కింద వర్సిటీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ హయాంలో డీజీపీఎస్ సర్వే చేశారు. కుమార్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 229లో భూమిని ఆక్రమించినట్లు తేలిన 17 మందికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. కాగా, ఆ సర్వే నంబర్‌లోని ఆక్రమణదారుల్లో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు పేరు ప్రధానంగా వినిపించింది. ఏఆర్ అశోక్ బాబు అప్పటి వీసీ రమేశ్ కు సన్నిహితుడనే పేరుండగా ఆయనను కాపాడేందుకు అప్పటి వీసీ ప్రయత్నించారనే ఆరోపణలున్నాయి. ఇదిలాఉంటే వర్సిటీ భూముల రక్షణ కోసం ఏర్పాటు చేసిన కేయూ ల్యాండ్స్ కమిటీ కూడా ఓ రిపోర్ట్ తయారు చేసింది. అందులో కేయూ భూములు, ఆక్రమణదారులు, ఎక్కడెక్కడ ఎంతెంత కబ్జా అయిందో అన్ని వివరాలు పొందుపరిచారు. కాగా, ఆ రిపోర్టులో ఓ మాజీ ఎమ్మెల్యే, కార్పొరేటర్‌తో పాటు కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఏఆర్ అశోక్‌బాబు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్లు ఇద్దరు, ఒక ఏసీపీ, సీఐ, ఒక ఎంవీఐ, ఎస్ఐ, తహసీల్దార్ పేర్లు పొందుపరిచారు. ఈ రిపోర్టుకు కేయూ ఈసీ ఆమోదం తెలిపిన తరువాత సమగ్ర విచారణ జరిపి, కబ్జాదారులపై యాక్షన్ తీసుకోవాల్సి ఉంది. కానీ, ఇంటి దొంగలను వెనకేసుకొచ్చేందుకే ల్యాండ్ కమిటీ రిపోర్టును పక్కన పెట్టారనే ఆరోపణలున్నాయి.

**వీసీ చొరవ చూపితేనే**

సర్వే పూర్తి చేసి కాంపౌండ్ నిర్మిస్తామని చెప్పిన ఆఫీసర్లు ఆ తరువాత ఆ విషయాన్ని గాలికొదిలేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీ భూముల ఆక్రమణలో ఉన్న ఆఫీసర్లు, పొలిటికల్ లీడర్లను వెనకేసుకొచ్చేందుకే ఆ విషయాన్ని లైట్ తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికే ఇన్‌చార్జి వీసీ చొరవతో కేయూ భూముల సర్వే, కాంపౌండ్ నిర్మాణానికి కమిటీ ఏర్పాటు కాగా క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్ననారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రత్యేక దృష్టి పెట్టి కేయూ భూముల సర్వే పూర్తి చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**రెండ్రోజుల్లోనే సర్వే స్టాప్.**

వర్సిటీ భూముల వ్యవహారాన్ని విద్యార్థి సంఘాలతో పాటు అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్(అకుట్) ప్రతినిధులు కూడా పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత సర్కారు ఈ వ్యవహారాన్ని గాలికొదిలేయగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడిన తరువాత వర్సిటీ భూముల పరిరక్షణ, కాంపౌండ్ నిర్మాణానికి రూ.10 కోట్లు సాంక్షన్ చేసింది. ఈ నేపథ్యంలో జులై 1న కాంపౌండ్ నిర్మాణానికి ఆఫీసర్లు ఎలాంటి అభ్యంతరాలు లేని వరంగల్, - కరీంనగర్ హైవే వైపు భూమి చదును పనులు ప్రారంభించగా ఆక్రమణకు గురైన భూముల విషయంలో ఎలాంటి సర్వే నిర్వహించకుండానే కాంపౌండ్ వాల్ నిర్మించడంపై స్పందించిన ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ కేయూ భూములపై ఫిజికల్ సర్వే నిర్వహించాలని, ఈ మేరకు వర్సిటీకి చెందిన ఏడుగురు ఆఫీసర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. వారంతా కలిసి జులై 14న గుండ్ల సింగారం వైపు సర్వే ప్రారంభించారు. సర్వే పూర్తి చేసిన అనంతరం హద్దులు కూడా నిర్ణయిస్తామని చెప్పారు. కానీ, ఆ తరువాత రెండు రోజులు వర్షాలు కురవగా దానిని సాకుగా చూసి సర్వేకు బ్రేకులు వేశారు. నెల దాటినా ఇంతవరకు మళ్లీ సర్వే ప్రారంభించలేదు.

**15 రోజుల్లో సర్వే పూర్తి చేస్తం**

కేయూ భూముల సర్వే ఆగిపోయిన మాట వాస్తవమే. ఉద్యోగుల బదిలీతో పాటు సర్వేయర్లు గౌరవెల్లి ప్రాజెక్టు పనుల్లో ఉండడం వల్ల సర్వే కాస్త ఆలస్యమైంది. వర్సిటీ భూముల రక్షణపై ఇన్‌చార్జి వీసీ ప్రత్యేక దృష్టి పెట్టారు. రెండు, మూడు రోజుల్లో సర్వే మళ్లీ ప్రారంభిస్తాం. 15 రోజుల్లో సర్వే కంప్లీట్ చేసి హద్దులు నిర్ణయించి, కాంపౌండ్ నిర్మాణానికి చర్యలు చేపడతాం.

# డ్వాక్రా మహిళలకు రూ.20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

మొదటి పేజీ తరువాయి

రుణాలు ఇస్తామని అన్నారు. మహిళా సంఘాలకు వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇస్తామని కీలక ప్రకటన చేశారు. అతి త్వరలోనే రాష్ట్రంలోని ఇళ్లు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇళ్లకు భూమి పూజ చేస్తామని ప్రకటించారు. అంతేకాదు.. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతులు పైమొత్తం చెల్లించాలని సూచించారు. పైమొత్తం చెల్లించి వ్యవసాయ శాఖకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందిన వెంటనే రూ.2 లక్షల రుణం మాఫీ అవుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ పాలకులు పదేళ్లు కాలయాపన చేశారు కానీ ఏనాడూ రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. గత ఐదేళ్లు పంటల బీమా కూడా వేయలేదు అని గుర్తుచేశారు. తాము అధికారంలోకి రాగానే పంటల బీమా చెల్లించామని తెలిపారు. రైతులు కట్టాల్సిన డబ్బులను బీమా కంపెనీలకు ప్రభుత్వమే చెల్లించిందని అన్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# చట్టాలు మారితేనే... న్యాయం

గతంలో నిర్భయ హత్యాచారం కేసు, మొన్నటికి మొన్న నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసు నుండి ఇపుడు హాస్పిటల్లో ఏకంగా ఒక ట్రెయినీ డాక్టర్‌పై ఘోర హత్యాచారం.. వరుసగా ఈ దారుణ ఘటనలు వింటుంటే ఒళ్ళు జలదరిస్తోంది. 2012 నుంచి అత్యాచారం కేసులు పెరుగుతున్నాయే గానీ, వాటి సంఖ్య తగ్గడంలేదు. ఈ అత్యాచారాలకు ముగింపు ఎప్పుడో .. ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు మాత్రం ర్యాలీలు తీయడం, కొవ్వొత్తులు వెలిగించడం. అవి అరిపోయాక ఆ సంఘటన మరిచిపోవడం అలవాటు అయిపొయింది అందరికీ. కానీ రేపటి రోజు ఆ చిన్నారి స్థానంలో గానీ, నిర్భయ స్థానంలో గానీ మన పిల్లల్ని చూసే పరిస్థితి రాకూడదంటే సమాజంలో ఎటువంటి మార్పులు తీసుకు రావాలి అని ఆలోచించే సమయం ఇది.!అసలు లైంగికదాడి, హత్యాచారం వంటి దారుణ ఘటనలు జరగడానికి కారణాలు ఏంటో తెలుసుకుని వాటికి పరిష్కారం తెలుసుకుంటే సమాజంలో మార్పులు చూడవచ్చు. ఈ మధ్య కాలంలో టీవీల్లో, సినిమాల్లో ప్రకటనల్లో ఎక్కడ చూసినా, విన్నా ఒక మాటే చెపుతున్నారు. అమ్మాయిలకి ఎలాంటి బట్టలు వేసుకోవాలో చెప్పేకన్న మీ అబ్బాయిలకు చదువుతో పాటు సంస్కారం నేర్పండి అంటున్నారు. దాంతోపాటు మహిళలపై, చిన్న పిల్లలపై లైంగిక దాడులను అరికట్టాలంటే కఠినమైన చట్టాలు, విద్య విధానంలో మార్పు తేవాలి. కుటుంబ విలువలు నేర్పాలి. మన దేశంలో పేదరికం, అక్షరాస్యత పూర్తిగా నిర్మూలించడం అసాధ్యం. చదువుకున్న వాడికైతే సంస్కారం నేర్పగలము కానీ చదువుకున్నప్పటికీ మనసులో తప్పుడు ఆలోచనలు పెట్టుకున్న వాడికి, నాగరికత, సమాజం పట్ల బాధ్యత, భయం లేని వారికి ఎవరు నేర్పుతారు?సమాజాన్ని బాగుపరచటంలో మీ వంతు సహాయం లేకపోయినా పర్వాలేదు కానీ సమాజంలో జరుగుతున్న సంఘటనలకు మీరు కారణం కాకూడదు. మన సమాజంలో చిన్నతనం నుంచి రకరకాల కారణంగా కుటుంబ విలువలు, మాట్లాడే పద్ధతి తెలియకుండా, మంచీ చెడూ తెలియకుండా పెరిగిన ఎంతో మంది ఈ సమాజంలో మన మధ్యలో తిరుగుతున్నారు. చదువుకున్నా కూడా చిన్నప్పటి నుంచి వాళ్లకు జరిగిన చేదు అనుభవాల వల్ల కొందరిలో మానసికోన్మాదపు వ్యక్తిత్వం వస్తుంది. అలాంటి వాళ్లకు చదువుతో పని లేదు. అమ్మాయిలు ఎదుటి వారిలో కోరికలను ప్రేరేపించే దుస్తులు వేసుకుంటేనే అత్యాచారాలు జరుగుతాయని గ్యారంటీ ఎక్కడుంది? కోల్‌కతా మెడికల్ కాలేజీలో ఆ ట్రెయినీ డాక్టర్ ఎలాంటి రెచ్చగొట్టే దుస్తులు వేసుకుందని ముష్కరులు అంత దారుణ కృత్యానికి ఒడిగట్టారు మూడేళ్ల పసిపాపలు, 70 ఏళ్ల ముదుసలులు ఎవరిని రెచ్చగొడుతున్నారని వారిమీద పడుతున్నట్లో మరి.ప్రస్తుతం వున్న విద్యా వ్యవస్థలో మార్పు రావాలి. మనోవిజ్ఞానం అనే అంశాన్ని ఒక సబ్జెక్టుగా గుర్తించాలి. చిన్నప్పటి నుండే ప్రతీ స్టూడెంట్ మానసిక పరిస్థితిని గుర్తించడం, వారిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు చేయాలి. ఒక హత్య కానీ, లైంగిక దాడి కానీ చేసిన వ్యక్తిని మెంటల్ హాస్పిటల్‌లో వుంచి కేస్ స్టడీ చేసి, తన మానసిక పరిస్థితికి కారణాలు కనుక్కుని ఆపై అతగాడికి జాప్యం లేకుండా కఠిన శిక్ష విధించాలి. అయితే కఠిన చట్టాలు విధించినంత మాత్రాన తప్పు చేయరనీ, లైంగిక దాడులు ఆగిపోతాయని అనుకోలేం. ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు తీరును సుప్రీం ధర్మాసనం తీవ్రంగా ఖండించింది. మెడికల్ ప్రిన్సిల్ తీరుపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. నేరాన్ని ఉదయాన్నే గుర్తించినట్లు తెలిసినా.. ప్రిన్సిపల్ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని కోర్టు వ్యాఖ్యానించింది.ప్రిన్సిపల్ ప్రవర్తనపై అనుమాలు ఉన్నా.. అతడిని వెంటనే మరో కాలేజీకి ఎలా నియమించారని సీజేఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. ఇక ఎఫ్ఐఆర్ నమోదు కూడా ఆలస్యమైంది. మృతదేహాన్ని అంత్యక్రియలకు అప్పగించిన మూడు గంటల తర్వాత రాత్రి 11.45 గంటలకు ఎందుకు నమోదు చేయాల్సి వచ్చింది? ఆసుపత్రి అధికారులు, కోల్‌కతా పోలీసులు అప్పటిదాకా ఏం చేస్తున్నారు అంటూ ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.ఇక పలు మీడియా సంస్థల తీరుపై కూడా కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితురాలి ఫొటో, పేరును ఎలా ప్రచురిస్తారంటూ ప్రశ్నించింది. అలాగే వ్యవస్థలో ఉన్న కొన్ని లోపలపై కూడా ధర్మాసం పలు కీలక ప్రశ్నలను సంధించింది. మహిళలు ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి లేకపోతే.. పనిచేసే ప్రదేశంలో భద్రత లేకపోతే వారికి మనం సమానత్వాన్ని నిరాకరిస్తున్నట్లేనని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుత రోజుల్లో చాలా మంది యంగ్ డాక్టర్లు 36 గంటలు ఏకధాటిగా పనిచేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో భద్రత కల్పించడం కోసం ఓ జాతీయ ప్రొటోకాల్‌ను రూపొందించడం అత్యవసరమని కోర్టు వెల్లడించింది. ఇందుకోసం వెంటే ఓ జాతీయ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ గ్యాస్ట్రాలజీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, సర్జన్ వైస్ అడ్మిరల్ ఆరే సరిన్ తదితరులు సభ్యులుగా ఉంటారని ధర్మాసనం తెలిపింది. రెండు వారాల్లోపు మధ్యంతర నివేదిక సమర్పించాలని నేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు డాక్టర్ల విధుల బహిష్కరణతో చాలా మంది రోగులు ఇబ్బందిపడుతున్నారని, తక్షణమే తమ నిరసనలు విరమించాలని డాక్టర్లకు సుప్రీంకోర్టు విజ్ఞప్తి చేసింది. అనంతరం ఈ విచారణను సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది.దుబాయ్, అమెరికా లాంటి దేశాల్లో తప్పు చేయటానికి భయపడతారు కాబట్టి అక్కడ నేరాలు ఏవీ జరగవని చెప్పగలమా?మన దేశంలో మార్పు రావాలి అంటే చట్టాలు మారాలి, విద్యా వ్యవస్థ మారాలి. అందరికీ ఉచిత విద్య, అందరికీ క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తే ఆరోగ్యమైన మనోవికాసంతో మన దేశం గర్వపడేలా ఒలింపిక్స్ లో గెలవగలుగుతారు. లేదా తప్పు దారుల్లో వెళ్లి ఇలాంటి హత్యాచారాలు చేస్తూనే వుంటారు. ఇలాంటి కేసు స్టడీలని మనోవిజ్ఞాన సబ్జెక్టులో చేర్చి ఒక ఉదాహరణగా చూపించాలి.

# జానపద దినోత్సవం వేడుకలకు బయలుదేరిన డప్పు కళా బృందం



గరిడేపల్లి, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండల కేంద్రంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన సతీష్ మహిళా డప్పు కళా బృందానికి తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు అందె మ్యూజిక్ అకాడమీ నుండి పిలుపు రావడంతో బుధవారం వైజాగ్ కీ మహిళా డప్పు కళాకారులూ బయలుదేరారు. ఈ సందర్భంగా సతీష్ మహిళా డప్పు కళా బృందం డైరెక్టర్ అమరవరపు సతీష్ మాట్లాడుతు ఆంధ్రప్రదేశ్ లోని వైజాగ్ లో జాతీయ జానపద దినోత్సవం నిర్వహించనున్న వేడుకలకి తమ బృందానికి పిలుపు రావడంతో వైజాగ్ కళా బృందంతో బయలుదేరడం జరిగింది అని అన్నారు. తమ బృందానికి ఇంత చక్కని అవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా మామిడి హరికృష్ణకి అందె మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ అందె భాస్కర్ కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నమని అన్నారు. సతీష్ మాట్లాడుతు తమ గ్రామం, మండలం నుండి కళాకారులకీ ఈ అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని. వీరు చేసే డప్పు నృత్య ప్రదర్శన చాలా అద్భుతంగా ఉంటుందని వీటిని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా యావత్తు ప్రపంచానికి తెలుస్తుందని మా మండలానికి మంచి పేరును తీసుకువస్తున్న మహిళా డప్పు కళాకారులకు ధన్యవాదములు అని అన్నారు. ఈ కార్యక్రమం మహిళా డప్పు బృందం కళాకారులూ పాల్గొన్నారు.

# మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్ఐ

## పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి



పెబ్బేరు, ఆగస్టు 21(తీన్మార్ న్యూస్): పెబ్బేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బుదవారం బాధితులకు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి అందజేశారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణ కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాదాపు కొన్ని రోజుల క్రితం వారి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు. బాధితులు సీఈఐఅర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా వారి మొబైల్ ఫోన్ ను గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుని బాధితులకు పోలీస్ స్టేషన్ లో అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా సెల్ పోన్ పోగొట్టుకున్నట్లయితే వివరాలను సీఈఐఅర్ ఫోర్టల్ నమోదు చేస్తే ఫోన్లను గుర్తించడానికి అవకాశం ఉంటుంది. అంతేకాకుండా ఎవరికైనా మొబైల్ ఫోన్లు దొరికితే వాటిని వెంటనే పోలీస్ స్టేషన్ లో అందించాలని ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి కోరారు. మొబైల్ తిరిగి తమ చేతికి వచ్చినందుకు సిఈఐఆర్ పోర్టల్ చాలా ఉపయోగపడిందని తిరిగి మొబైల్ ను ఎస్ఐ చేతుల మీదుగా తీసుకోవడంతో వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో అటకెక్కిన పారిశుద్యం

- దోమల నివారణకు చర్యలు శూన్యం
- స్పెషలాఫీసర్ల పర్యవేక్షణ లోపం.. కార్యదర్శుల నిర్లక్ష్యం
- విజృంభిస్తున్న విష జ్వరాలు
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి అనంత ప్రకాష్



పాలకవీడు, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): పాలక వీడు మండలంలోని గ్రామపంచాయతీలలో పారిశుధ్యం పడక వేసిందని సీజనల్ వ్యాధులు రాకుండా దోమల నివారణకు గ్రామపంచాయతీలో చర్యలు చేపట్టడం లేదని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ తెలిపారు. గ్రామ స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణ లోపం మరియు పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని అనేక గ్రామాల్లో పెద్ద సంఖ్యలో విష జ్వరాలు టైఫాయిడ్ మలేరియా డెంగీ జరాలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పనులు దోమల నివారణకు వెంటనే మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలని ఆయన కోరారు. వైద్యాధికారులు తక్షణమే గ్రామాల్లోకి మొబైల్ టీములను పంపి ప్రజలకు మెరుగైన చికిత్స అందించి విష జ్వరాల భారీ నుండి ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.

# రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారం యూత్ ఫెస్ట్ కార్యక్రమం




ములుగు, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో బుధవారం ములుగు జిల్లాలో యూత్ ఫెస్ట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా డా.అప్పయ్య డిఎం అండ్ హెచ్ఓ ములుగు జిల్లా మారాతాన్ రెడ్ రన్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తర్వాత జరిగిన సమావేశంలో డా.అప్పయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు HIV/ AIDS గురించి అవగాహన కలిగి ఉండాలనీ, 18 సంవత్సరాలు నిండిన వారందరూ రక్తదానం చేయాలనీ తెలియ చేసారు.అలాగే HIV సోకిన వారి యెడల వివక్ష,చిన్నచూపు చూడరాదని అన్నారు.మరియు HIV కి ART మందులు అందుబాటులో ఉన్నాయి అని తెలుపుతూ, మందులు ఉన్నాయని విచ్చల విడిగా ప్రవర్తించ కూడదనీ అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో 8th & 9th విద్యార్థిని విద్యార్థులకు HIV/AIDS పైన క్విజ్ కాంపిటీషన్ నిర్వహించడం జరిగింది. మారథాన్ రెడ్ రన్ పోటీ మరియు క్విజ్ కార్యక్రమంలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నగదు మరియు ప్రశంస పత్రాలు డా.అప్పయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ ఎయిడ్స్ అండ్ లేప్రసీ Dr.Bhavya gaaru,.దిశా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ K. జ్యోతి గారు ,CSO బి సారయ్య గారు , DMDO సాయి గారు,ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మల్లేష్ గారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ రఫీక్, డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ సోమన్న, ప్రభుత్వపాఠశాల ప్రిన్సిపాల్ కళాశాల భోధన సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు రెడ్ రన్ మారథాన్ కార్యక్రమం లో పాల్గొన్నారు మరియు ఐసీటీసీ కౌన్సిలర్ లింకు వర్కర్ స్కీం సిబ్బంది పాల్గొన్నారు.

# నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలి

## పనుల పురోగతిపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలని ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరిచెందన అన్నారు. బుధవారం డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులను సంబంధించి భూసేకరణ పనుల పురోగతి గురించి సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరిచెందన మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని రైతులతో మాట్లాడి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణకు జిల్లాలోని మూడు మండలాల పరిధిలోని 14 గ్రామాల రైతులకు సంబంధించిన 130.5 హెక్టార్ల విస్తీర్ణం అవసరం ఉందని, భూసేకరణ జరుపుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు భూసేకరణకు సంబంధించి రైతులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించడం జరిగిందని రిజిస్ట్రేషన్ ధరకు రెండు రెట్లు ఎక్కువ ఇవ్వడానికి అవార్డు జారీ చేస్తే రైతులు ఒప్పుకోలేదని రైతులతో నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కూడా పాల్గొని రైతులకు న్యాయం చేయాలని కోరారని పేర్కొన్నారు. మరొక సారి రైతులతో సమావేశం నిర్వహించి భూసేకరణ పనులను పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఎఫ్ఓ వసంత, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన మనోహర్ గౌడ్



ఆత్మకూరు, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం కార్యవర్గ సభ్యులుగా అక్కల మనోహర్ గౌడ్ నియమితులయ్యారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నంచెర్ల గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబం నుండి వచ్చి విద్యార్థి దశలో ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా అనేక సామాజిక ఉద్యమాలలో విద్యార్థి ఉద్యమాలలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని ఎల్లప్పుడూ ప్రజా శ్రేయస్సు కోసం మనోహర్ గౌడ్ పని చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తించి భారతీయ జనతా పార్టీ నాయకత్వం గుర్తించి గురువారం రోజు రాష్ట్ర బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయనను నియమించిన బాధ్యతను విశ్వాసంతో రాష్ట్ర నాయకత్వానికి మరియు జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నేడు మక్తల్లో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

## మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం



ఆత్మకూర్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరగబోయే ధర్నా కార్యక్రమానికి ఆత్మకూరు మండలంలోని మాజీ జెడ్పిటిసిలు, మాజీ ఎంపీపీలు బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు, బి.ఆర్.ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, రైతు సంఘాలు కార్యకర్తలు, తదితరులు భారీ ఎత్తున పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్మకూరు మండల బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు ఎం.రవికుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యార్థులు సమాజంలో సేవా భావంలో రాణించాలి



## మత్తు పదార్థాలను నిర్మూలించాలి ఎస్సై రవీందర్

నేరేడుచర్ల, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు గంజాయి ఆంటీ డ్రగ్స్ మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నేరేడుచర్ల ఎస్సై రవీందర్ నాయక్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సైదులు, కళాశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సోమేశ్ వర్మ

## వరంగల్ నుంచి రెండోసారి మళ్లీ అవకాశం



వరంగల్, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రెండవసారి నియమితులైన వరంగల్ మట్టెవాడ 24వ డివిజన్ కు చెందిన సిలుసాని సోమేశ్వర్ వర్మ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామీద నమ్మకంతో మరోసారి నాకు ఈ బాధ్యత అందించిన రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సెవెళ్ళ మహేందర్కి, అందుకు సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్ కి, జిల్లా నాయకులకు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థులు నిరుద్యోగుల కోసం భారతీయ జనతా యువమోర్చా తరఫున మరింత పోరాడుతాననీ, వారి సమస్యల పరిష్కారం కోసం శయశక్తుల ప్రయత్నిస్తానని అన్నారు.

# వ్యాయామం చేస్తూ ఏఎస్ఐ మృతి

నిజామాబాద్: ఓ ఏఎస్ఐ వ్యాయామం చేస్తూ గుండెపోటుతో ప్రాణాలు విడిచిన విషాద ఘటన బుధవారం నిజామాబాద్ నగరంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న దత్తాద్రి రోజులాగే ఇంట్లో వ్యాయామం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను చికిత్స కోసం ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. దత్త్రాద్రిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నగరంలోని గాయత్రినగర్‌లో నివాసముంటున్న దత్తాద్రికి డిపార్ట్‌మెంట్‌లో మంచి పేరుందని తోటి సిబ్బంది తెలిపారు.

# ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్



ములుగు, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. అధికారులను ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కొరకు ఏర్పాటు చేసిన బృందాలతో కలెక్టర్ దివాకర టి. ఎస్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, సి. హెచ్. మహేందర్ జి లతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని, ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సర్వే నెంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులు కు డాక్యుమెంట్లు, ఫ్లాట్ ఇమేజెస్, మాస్టర్ ప్లాన్ జత చేసి ఉండాలన్నారు. ఆ స్థలం ప్రభుత్వాన్నిదా, సికం భూమి, ఎఫ్టిఎల్ పరిధిలో ఉన్నదా అని పరిశీలించాలని సూచించారు. బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లేటప్పుడు గ్రామాల వారీగా, సర్వే నెంబర్ల ప్రకారం వెళ్తే పని సులభం అవుతుందని తెలిపారు. బృందంలోని సభ్యులందరూ లాగిన్ అయ్యే విధంగా చూడాలన్నారు. మీకు కేటాయించిన మండలానికి సంబంధించిన అప్లికేషన్ లు మాత్రమే పరిశీలించాలి అని అన్నారు. బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లే ముందు షెడ్యూల్ తయారు చేసుకోవాలని ఆ షెడ్యూల్ ప్రకారం ఆ దరఖాస్తుదారిది ఏ గ్రామం, ఎప్పుడు వెళ్ళేది తెలుసుకొని దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని అన్నారు. అలా చేయడంవల్ల ఎవరైనా డాక్యుమెంట్లు జత చేయనట్లయితే వారిని అడిగి జత చేయవచ్చున్నారు. తేది.26.8.2020 కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకొని ఎల్ ఆర్ ఎస్ ఆన్లైన్లో దరకాస్తూ చేసుకొన్న డాకుమెంట్స్ దరఖాస్తుల స్క్రుటిని ప్రక్రియ జరుగుతున్నదని అన్నారు. 4980 ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి, క్షేత్ర స్థాయిలో పరిశీలనకు 19 బృందాలను బృందానికి ముగ్గురు చొప్పున నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చాలా జాగ్రత్తగా చేయాలని, ఎలాంటి పొరపాటు లేకుండా దరఖాస్తులు అప్లోడ్ చేయాలని సూచించారు. పట్టా ఉన్నవారు మాస్టర్ ప్లాన్ లో ఉన్న వారి దరఖాస్తులను సులభంగా నమోదు చేయవచ్చని, ప్రతి టిం ప్రతి రోజూ 35 దరఖాస్తులు సంపూర్ణంగా ఉన్న దరఖాస్తులను అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కే. సత్య పాల్ రెడ్డి, డి పి ఓ ఇంచార్జీ సంపత్ రావు, జిల్లా ఇర్రిగేషన్ అధికారి అప్పలనాయుడు, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఇర్రిగేషన్ ఏ ఈ లు, ఆర్ ఐ లు, పంచాయితి సేక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూతనివ్వడం మనందరి బాధ్యత

### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్
### 22న, 23న నిర్వహించే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి





ములుగు జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులకు చేయూతనివ్వడం మనందరి బాధ్యత అని, 22న పస్రా, 23న ఏటూరునాగారంలలో నిర్వహించే శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలనీ, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. బుదవారం ములుగు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఆలింకో హైదరాబాదు వారి సహకారంతో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. హాజరై మాట్లాడుతూ ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించుట కొరకు అవసరమైనటువంటి సహాయ ఉపకరణాలను గుర్తించేటకై శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, దివ్యాంగులు దూర ప్రాంతాల నుండి రావడం వారికి ఇబ్బంది అవుతుందని వారి సౌకర్యార్థమై రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా జిల్లాలో ప్రత్యేకంగా మూడు క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందని, ములుగు, పస్రా, ఏటూరునాగారం ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇట్టి శిబిరాలను ఉపయోగించుకొని దివ్యాంగులు అందరూ హాజరై వారికి అవసరమైనటువంటి సహాయ ఉపకరణాలను పొందాలని తెలిపారు. దివ్యాంగులకు సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అందరూ అధికారులు బాధ్యతగా తీసుకొని దివ్యాంగులకు అవసరమైనటువంటి పరికరాలను గుర్తించి ఆలెంకో సంస్థ ద్వారా వారికి అందివ్వడం జరుగుతుందని అన్నారు. ఈ శిబిరం ద్వారా వివిధ రకాలైన దివ్యాంగులకు వారికి అవసరమైనటువంటి పలురకాల సహాయ ఉపకరణాలను గుర్తించడం జరుగుతుందని, ఇట్టి గుర్తించిన సహాయ ఉపకరణాలను అలింకో హైదరాబాద్ వారి సహకారంతో లబ్ధిదారులందరికీ మరొక శిబిరం ద్వారా అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరానికి వివిధ గ్రామాల నుండి దివ్యాంగులను తీసుకొని వచ్చినటువంటి మహిళా అభివృద్ధి శాఖ అధికారులు, సూపర్వైజర్ అంగన్వాడీ టీచర్లను మరియు డిఆర్డిఏ శాఖ నుండి అధికారులందరినీ కలెక్టర్ అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని స్వర్ణలత లేనిన మాట్లాడుతూ ఈ శిబిరానికి ములుగు వెంకటాపూర్ గోవిందరావుపేట మండలాల నుండి దివ్యాంగులను సమీకరించడానికి సహకరించినటువంటి అధికారులకు దివ్యాంగుల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలీంకో సంస్థ ప్రతినిధి ఆశిష్ మాట్లాడుతూ దివ్యాంగులు 40 శాతం దివంగత్వం పైబడినటువంటి వారికి మరియు 80% దివ్యాంగత్వం పైబడినటువంటి వారికి ఇలా ప్రత్యేకంగా గుర్తించి వారి వారి అవసరాలను బట్టి వారికి రకరకాల సహాయ ఉపకరణాలను నిర్ణయించి అందివ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఈరోజు శిబిరానికి హాజరు కానటువంటి దివ్యాంగులు గురువారం పస్రాలో, శుక్రవారం ఏటూరు నాగారంలో జరగబోయే క్యాంపులలో ఈ రోజు హజరు కానీ వారు హాజరై సద్వినియోగం చేసుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సంపత్ రావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, ప్రియనేస్తం ఫౌండేషన్ పి.నాగరాజు, ములుగు ఎంపీడీవో, ములుగు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్, అలీమ్ కో సంస్థ ప్రతినిధులు, స్థానిక సిడిపిఓ శిరీష, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది %డ% జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కొరకు ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు

### ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం విద్యార్థులు తాగునీటి కొరకు



నేరేడుచర్ల, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు 2004-05 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థుల త్రాగునీటి సౌకర్యార్థం "నీటి శుద్ధి యంత్రము" మరియు ట్యాంకును రూ 30000 లు వెచ్చించి అందించగా నాటి ప్రధానోపాధ్యాయులు కొప్పుల రంగారెడ్డి ప్రధాన ఉపాధ్యాయులు బట్టు మధుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన ఇటువంటి నీటి శుద్ధి యంత్రం, ట్యాంకు ఏర్పాటు చేయడం వారు చదువుకున్న పాఠశాలపైగల ప్రేమ, విద్యార్థుల పట్ల ఆత్మీయ అనురాగాలకు నిదర్శనం అన్నారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ సరిగ్గా 20 సంవత్సరాల క్రితం పాఠశాలలో పదవ తరగతి చదివి తదుపరి ఉన్నత చదువులు అభ్యసించి తమ తమ జీవితాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరూ తాము బాల్యంలో చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరిపి చదివిన పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం ప్యూరిఫైయర్ వాటర్ ప్లాంట్, ట్యాంకును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు సీజనల్ వ్యాధులు అధికంగా సంక్రమిస్తున్న ప్రస్తుత సమయంలో పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటుచేసిన నీటి శుద్ధి యంత్రం ద్వారా విద్యార్థులు మంచినీటిని త్రాగుతూ ఆరోగ్యంగా ఉండగలరని తద్వారా చదువుల్లో సైతం చురుకుగా రాణించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు ఏర్పాటు చేసినందుకు పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వీరబాబు ఎం సైదులు రషీద్ ఖాన్ జానకిరాములు శౌరి వెంకటేశ్వరరావు మాధవి నాగమణి అర్జున్ ఎన్ వి జానయ్య వెంకటరెడ్డి బికోజి యాదగిరి రామమూర్తి శ్రీనివాసరెడ్డి శ్రీనివాసరావు లాల్ విజయలక్ష్మి సరస్వతి వెంకటేశ్వర్లు పూర్వ విద్యార్థులు నరేష్ శ్రవణ్ బాలకృష్ణ సురేష్ చిన్నమ్మాయి జ్యోతి మహేశ్వరి జానకి సతీష్ సైదులు అశోక్ తదితరులు పాల్గొన్నారు



# అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా గ్రంధాలయ సంస్థ సమావేశం



మహబూబాబాద్ జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): బుధవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అధ్యక్షతన అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా గ్రంధాలయ సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల పరిధిలో పాఠకులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకొనుటకు, చర్యలు తీసుకోవాలని, త్రాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థినీ, విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్, బుక్స్ గ్రంథాలయంలో అందుబాటులో ఉండే విధంగా చూడాలని తెలిపారు. క్రమం తప్పకుండా మున్సిపల్, గ్రామపంచాయతీలు, గ్రంథాలయ పన్ను చెల్లించాలన్నారు. జిల్లా గ్రంథాలయా సంస్థ మహబూబాబాద్ పరిధిలో స్వంత భవనము గల శాఖ/ గ్రామ గ్రంథాలయాలకు వైట్ వాషింగ్, కలర్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలని,రీడింగ్ రూమ్స్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి సెక్రెటరీ టి. శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

# డ్రా చేసిన లబ్ధిదారుల నుండి 15 రోజులలో రికవరీ చేయాలి

### బ్యాంకర్లును ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): ఎస్సి కార్పోరేషన్ ద్వారా 2016-17 నుండి 2018-19 వరకు మంజూరు చేసిన యూనిట్లకు సబ్సిడీ నిధులు డ్రా చేసిన లబ్ధిదారుల నుండి 15 రోజులలో నిధులు రికవరీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకర్లును ఆదేశించారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఎస్సి కార్పొరేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీ నిధులు డ్రా చేసిన అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సి కార్యాచరణ ప్రణాళిక ద్వారా మంజూరైన యూనిట్లు గ్రౌండింగ్ తదుపరి రుణము మరియు సబ్సిడీ నిధులు లబ్ధిదారులు డ్రా చేయాల్సి ఉంటుందని, అలా కాకుండా లబ్ధిదారులు నేరుగా సబ్సిడీ నిధులు డ్రా చేశారని, బ్యాంకులు వారిగా జాబితా అందచేశామని రికవరికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్సి కార్పొరేషన్ ఈడి వెంకటేశ్వరరావు, ఎల్డిఎం తిరుపతి, వివిధ బ్యాంకుల యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రణం

### నేడు ఏకశిలా పార్కు వద్ద ధర్నా
### మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ వెల్లడి



హన్మకొండ జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రోజున ప్రొఫెసర్ జయశంకర్ సర్ స్మృతివనం (ఏకశిలా పార్కు) వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఒక ప్రకటనలో మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యానిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు బాలసముద్రం లోని హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం రోజున ముఖ్యుల అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల పాలు చేస్తోందని ఆరోపించారు. రైతు రుణమాఫీ పూర్తిగా చేస్తామని చెప్పి ఎన్నికల్లో లబ్ధి పొందిన కాంగ్రెస్ నేడు కొంత మందికే చేసే రైతులను మోసం చేసిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రుణమాఫీ పూర్తి అయ్యిందని అంటాడు మంత్రులు ఇంకా చెయ్యలేదు అంటారు. కల్లోల కాంగ్రెస్.. రైతులను ఆగమాగం చేస్తోందని ఆరోపించారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్‌తో గురువారం రోజున ధర్నా కార్యక్రమాన్ని పార్టీ పిలుపు మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ అయ్యే వరకు రైతులకు అండగా బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతుబంధు నిధులు అతీగతి లేదని అన్నారు. రైతులకు బోనస్ విషయంలోనూ కాంగ్రెస్ బోగస్ మాటేలే అయ్యాయని విమర్శించారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వంపై పోరాటంలో కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, లోహితా రాజు, సోదా కిరణ్, నర్సింగ్, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, వేణు, యాదగిరి, నాయకులు మసూద్, జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్, నరెడ్ల శ్రీధర్, బండి రజినీకాంత్, రవీందర్ రావు, కృష్ణ, సదాంత్, షఫీ, ఖలీల్, రఘు, రామస్వామి, వెంకన్న, రాజు, రాజ్ కుమార్, విద్యార్థి నాయకులు వీర స్వామి, రాకేష్ యాదవ్, రాజ గోపాల్ రెడ్డి, శ్రీకాంత్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు

# రైతు వేదిక వద్ద రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మతో ధర్నా

### దిష్టి బొమ్మ దగ్ధం చేస్తుండగా అడ్డుకున్న పోలీసులు
### రుణ మాఫీ చేయకుంటే పోరాటం ఉదృతం చేస్తాం : రైతులు, నాయకులు



మంగపేట, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): బుధవారం ములుగు జిల్లా మంగపేట మండలంలోని రైతు వేదిక వద్ద రైతులతో కలసి బీజేపీ నాయకులు, రెండు లక్షల రైతు రుణ మాఫీ పూర్తి చేయాలని రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మతో ధర్నా కార్యక్రమం నిర్వహించి, రైతు వేదిక ముందు బైటాయించారు. అనంతరం దిష్టి బొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేస్తే ఊరుకోమని రైతులకు అండగా బీజేపీ ఉంటుందని, రుణ మాఫీ చేయకుంటే ఇంకా పోరాటం ఉదృతం చేస్తామని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్నాటి సతీష్, జిల్లా కార్యదర్శి లింగం పల్లి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి ఇందారపు ప్రతాప్ చల్లా రాంకీ, మండల నాయకులు పోదేం సుధాకర్,బీజేవైఎం మండల అధ్యక్షులు రాజేష్ బీజేవైఎం జిల్లా కార్యదర్శి కట్టుకోజు ప్రశాంత్ జిల్లా నాయకులు పగిడిపల్లి చంద్రం, మండల కార్యదర్శి బొల్లికొండ సాంబయ్య, సోషల్ మీడియా ఇంచార్జ్ ఎంబటి నవీన్ బీజేవైఎం శివ తదితరులు పాల్గొన్నారు

# ఆంక్షలు లేని రుణమాఫీ అందచేయాలి



నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు లేని రుణమాఫీ రైతులకు వెంటనే అందజేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్య స్థాపన అంటు తెలంగాణ ప్రజలను నిండా ముంచింది కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ బీజేపీ విలీనమంటూ ప్రజలను కాంగ్రెస్ తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ? కాంగ్రెస్ నాయకులు పదేపదే ఇందిరమ్మ రాజ్యమని మాట్లాడుతున్నారన్నారు.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ పాలన వచ్చేలా ఉందని విమర్శించారు. ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీలతో యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలందరూ కాంగ్రెస్ పాలన పట్ల విసుగు చెందారన్నారు

# అభివృద్ధి పనులే లక్ష్యంగా ఎమ్మెల్యే నాయిని పర్యటన

### వార్డుల పర్యటన, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే గ్యాంగ్ వర్క్ పేరుతో కాలనీల్లో సమస్య నిర్మూలన చర్యలు

హనుమకొండ జిల్లా, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ క్రింద బుధవారం హనుమకొండ నగరంలోని 4వ డివిజన్ జ్యోతి బసు నగర్ లో రూ. 10లక్షలు మరియు 60డివిజన్ వడ్డేపల్లి, టీచర్స్ కాలనిలో రూ. 35లక్షలలి తో అంతర్గత రోడ్ల (సీసీ ) నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో నియోజకవర్గన్ని అగ్రగామిగా ఉంచుతానని వారు తెలియజేశారు. ఈ పర్యటనలో 4వ డివిజన్ పరిధిలోని లోటస్ కాలనీలో విసతృతంగా పర్యటించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులతో కలియాతిరిగారు. ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజ్, నాలాల పై పేరుకుపోయిన పిచ్చి మొక్కలను త్వరగతన తీసేయాలని ఆదేశించారు. లోటస్ కాలానికి రోడ్ల నిర్మాణం కొరకు సంబంధిత అధికారులు నివేదికలు అందించాలని తెలిపారు.





లోటస్ కాలనిలో ప్రతియేట వర్షాలతో నీట మునిగే ప్రాంతాలకు పరిష్కార మార్గాలను చూపుతానని నేరుగా కాలనీ వాసులకు వివరించారు. సాయంత్రం వరకు సంబంధిత శాఖల అధికారులు వార్డులో పర్యటించి సమస్యలను నివృత్తం చేసే పనిలో ఉంటారని తెలియజేశారు. ప్రత్యేక ప్రణాళికతో "గ్యాంగ్ వర్క్ " ని ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా రోజుకు ఒకటి లేదా రెండు వార్డులలో/కాలనీలలో మున్సిపాలిటీ, ఇతర శాఖల సిబ్బంది దాదాపు 20మంది పనులు చేస్తారని తెలిపారు. ముంపు ప్రాంతాల ప్రజలకి వచ్చే ఏడాది నాటికి ఎలాంటి అవంతరాలు లేకుండా, ఖాబ్జాలకు గురైన ప్రాంతాలను తిరిగి యథాస్థానంలో ఉండేలా పనులు చేపడుతామని గుర్తుచేశారు. వడ్డేపల్లి, టీచర్స్ కాలనిలో స్థానిక ప్రజల అభిష్ట మేరకు మరో 20లక్షల నిధులు కేటాయిస్తానని ప్రస్తుత పనులను వేగవంతం చేయాలనీ కోరారు. వడ్డేపల్లిలో ఉన్నటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారిని దర్శంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట 4వ డివిజన్ లో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ నాయకులు వీరగంటి రవీందర్, నాలబోల సతీష్, బిన్ని లక్ష్మణ్, చీకటి ఆనంద్, 60వ డివిజన్ లో మాజీ కార్పొరేటర్ నాగరాజు, డివిజన్ ఏనుకొంటి పున్నం చందర్, యుగేందర్, నవీన్, కమల్, అక్మల్, సాదిక్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి: కలెక్టర్

కామారెడ్డి: ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ చేసే విధానంపై మండల స్థాయి, మునిసిపల్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలని తెలిపారు. ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని చెప్పారు. సర్వే నెంబర్లు, ప్లాట్ దరఖాస్తు సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాం భూమి, దేవాదాయ భూమి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయవద్దని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్లాట్ల యజమానులు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా అది ప్రభుత్వ స్థలము, ప్రైవేటు




స్థలమేనా అనేది పక్కాగా నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ సురేందర్, డిపిఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

# ఫోన్ ఎత్తరు.. సమాధానం చెప్పరు

**- అదేమిటంటే బిజీగా ఉన్నాను**

**- ఇది కలకోట సొసైటీ సీఈఓ వ్యవహారం**

**- రైతులకు అందుబాటులో ఉండరు**

బోనకల్: ఆ సారు కార్యాలయానికి ఎప్పుడు వస్తారో? ఎక్కడ ఉంటారో తెలియని అయోమయ పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా సమాచారం కోసం ఫోన్ చేస్తే అసలు ఫోన్ ఎత్తరు. ఎవరైనా గట్టిగా నిలదీస్తే బిజీగా ఉన్నానని సమాధానం చెప్తారు. ఇది కలకోట సీఈవో వనం మల్లికార్జున్ వ్యవహార శైలి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలో కలకోట సొసైటీ పరిధిలో కలకోట, రాయన్నపేట గ్రామాల రైతులు సభ్యులుగా ఉన్నారు. కలకోట సహకార సంఘంలో ప్రస్తుతం 270 మంది రైతులకు సంబంధించి రూ. 2.36 కోట్లు రుణమాఫీ జరగలేదు. అనేక మంది రైతులు తమకు రుణమాఫీ అయిందా? కాలేదా? అనే ఆత్రుతతో కలకోట సహకార సంఘ కార్యాలయానికి వస్తే సీఈవో సమాధానమే కరువవుతుందని రైతులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలకోట సహకార సంఘానికి రాయన్నపేట రైతులు వెళ్లాలంటే కనీసం మూడు కిలోమీటర్ల దూరం వెళ్లవలసి ఉంది. అంత దూరం కొంతమంది రైతుల వెళ్లలేక సీఈఓకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తటం లేదని అనేక మంది రైతులు ఆరోపిస్తున్నారు. చివరకు రుణమాఫీ సమాచారంపై జర్నలిస్టులు 10 నుంచి 15 సార్లు ఫోన్ చేసినా సీఈవో ఫోన్ ఎత్తకపోవడం విశేషం. ఎన్నిసార్లు చేసినా ఫోన్ ఎందుకు ఎత్తటం



లేదని ప్రశ్నిస్తే మాత్రం పొంతన లేని సమాధానం చెబుతారని రైతులు అంటున్నారు. మండలంలో తొమ్మిది సహకార సంఘాలు ఉండగా మిగిలిన సహకార సంఘాలు సీఈవోలు రైతులకు జవాబిదారితనంగా ఉంటుండగా వనం మల్లికార్జున్ మాత్రం తన దారే సపరేటు, తన రూటే సపరేట్ అనే విధంగా ప్రవర్తించడం పట్ల రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

చివరకు కలకోట సహకార సంఘం అధ్యక్షులు కూడా ఫోన్ చేసినా ఎత్తటం లేదని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. రైతుల సొమ్ముతో జీతం తీసుకుంటున్న సొసైటీ సీఈవో వ్యవహార శైలిపై పాలకవర్గం వెంటనే దృష్టి సారించి రైతులకు, ఇతరులకు జవాబుదారీతనంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు రైతుల కోరుతున్నారు. విధులకు కూడా సమయానికి రారనే విమర్శలు కూడా వనం మల్లికార్జున పై ఉన్నాయి.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్

ములుగు, ఆగస్టు 21 (తీన్మార్ న్యూస్): మంత్రి వర్యులు సీతక్క గన్ మెన్ రాజు బావ ములుగు మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన సర్జన రమేష్ ఇటీవలే మరణించగా వారి దశ దిన కర్మకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ హాజరై ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బాణోత్ రవి చందర్,బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవి యాదవ్,మండల అధ్యక్షులు ఎండీ చాంద్ పాషా, భాదం ప్రవీణ్,మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులునల్లెల భరత్ కుమార్,మాజీ ఎంపీటీసీ మవురపు తిరుపతి రెడ్డి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష అభ్యర్థి ఇస్సార్ ఖాన్, మాజీ



యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు కర్రి నాగేంద్ర బాబు యూత్ కాంగ్రెస్ పట్టణఅధ్యక్షులు రేసోజు అభి తదితరులు పాల్గొన్నారు

# రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- షరతులు లేకుండా వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్**

**- జాతీయ రహదారిపై బైఠాయించి రైతుల రాస్తారోకో**

కమ్మర్ పల్లి: రుణమాఫీ పేరట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తుందని పలువురు రైతు నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా ఈ ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని మండిపడ్డారు.ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి రైతులందరికీ ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక తూతూ మంత్రంగా రుణమాఫీ చేసి మాట తప్పారన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద 63వ నంబర్ జాతీయ రహదారిపై పార్టీలకు అతీతంగా రైతులు బైటాయించి, ధర్నా చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి తరలివచ్చిన రుణమాఫీ కానీ బాధిత రైతులు రహదారిపై బైఠాయించారు.ఈ సందర్భంగా పలువురు రైతు నాయకులు మాట్లాడుతూ రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ 100 శాతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధపు హామీలతో రైతులను దగా చేశాడన్నారు.ఎన్నికల్లో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని మాటిచ్చి గట్టెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీలు మరిచి రైతులను మోసం చేసిందన్నారు. మొదట డిసెంబర్ 9న అన్న రేవంత్ రెడ్డి మాట మార్చి వంద రోజులు ఉన్నాడని, అటు తర్వాత ఆగస్టు 15 పేరుతో ఏ జిల్లాకు వెళితే ఆ జిల్లాలలో ఉన్న ప్రసిద్ధ దేవుళ్లపై ప్రమాణాలు చేసి కాలయాపన చేశాడన్నారు. తీరా ఆగస్టు 15 గడిచిన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ కాలేదని ఆరోపించారు. దేవులపై ఒట్టు




వేస్తూ మరి ఇప్పటికి మూడుసార్లు రైతులను రేవంత్ రెడ్డి మోసం చేశాడన్నారు. మండలంలోని ఇంకా వేలాది మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు.రుణమాఫీ అందని రైతులు కడుపు మండి ప్రభుత్వంపై వ్యతిరేకతతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా, ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ కాకపోతే ఆందోళనృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేయడంతో రోడ్డు వైపుల పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకొని అక్కడికి వచ్చిన తహసిల్దార్ ఆంజనేయులు రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం తప్పకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తుందని, ఆందోళన విరమించాలని ఈ సందర్భంగా ఆయన రైతులను కోరారు. రుణమాఫీ కానీ రైతులు అప్లికేషన్ ఫారం నింపి అందజేయాలన్నారు.అయినప్పటికీ ఆందోళన చేస్తున్న రైతులు వినకపోవడంతో పోలీసులు పలువురు రైతు నాయకులను బలవంతంగా పోలీస్ వాహనంలో స్టేషన్ కు తరలించారు.

# కీటక జనిత వ్యాధులపై సమీక్ష

### జిల్లా వైద్యాశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్

మహబూబాబాద్ జిల్లా, ఆగస్ట్ 21 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. మురళీధర్, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు మరియు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కి, హెల్త్ సూపర్వైజర్లకు, కీటక జనతా వ్యాధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భాగంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, వర్షాకాలంలో ముఖ్యంగా చికెన్ డెంగ్యూ, మలేరియా ఫైలేరియా, డెంగ్యూ, వ్యాధులు రాకుండా, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే చేయాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మలేరియా లార్వాలను డిస్కవర్ చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని, హాస్టల్స్ విజిట్ చేయాలని, జ్వరం వస్తే, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని



సంప్రదించాలని, మందులు సరిపడా ఉంచుకోవాలని, కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్, కె.వి.రాజు, గీతా, హెల్త్ ఎడ్యుకేటర్, డిపిఓ రుక్మొద్దీన్, వైద్యాధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం.. విషజ్వరాలకు బలవుతున్నప్రజలు

### మాజీ మంత్రి హరీష్ రావు

హైదరాబాద్: డెంగీ, మలేరియా, గన్యా వంటి విషజ్వరాలతో రాష్ట్రం వణుకుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం శోచనీయంని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. డెంగీ జ్వరాల బారిన పడి 24 గంటల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ప్రభుత్వ నిర్లక్ష్యం, రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతున్నది. ఇలాంటి పరిస్థితులు వస్తాయని ముందే ప్రభుత్వాన్ని హెచ్చరించాం. నిధులు విడుదల చేసి పారిశుద్ధ్య నిర్వహణ కొనసాగించాలని, ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని వానాకాలం ప్రారంభంలోనే కోరాము. కానీ ప్రభుత్వం మా సూచనలను పెడచెవిన పెట్టింది. సకాలంలో చర్యలు తీసుకొని ఉంటే విషజ్వరాలు ఇంతగా విజృంబించేవి కావని అన్నారు. ఏటా వానాకాలం ప్రారంభంలోనే పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉంటుంది. కానీ ఈ ప్రభుత్వం మొదటి నుంచి పూర్తి నిర్లక్ష్యం వహిస్తూ వచ్చింది. ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఒక్కనాడు కూడా సమీక్ష నిర్వహించ లేదు. దోమల నివారణకు గ్రామాలు, పట్టణాల్లో స్పెషల్ డ్రైవ్ లు చేపట్టలేదు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మరోవైపు పంచాయతీలకు నిధులు విడుదల చేయయపోవడంతో గ్రామాలు మురికికూపాలుగా మారుతున్నాయి. సొంత జేబుల నుంచి ఖర్చు చేస్తూ వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ఇక తమ వల్ల కాదని సామూహికంగా సెలవులు పెడుతున్నారు, విధులకు దూరంగా ఉంటున్నారు. ప్రభుత్వ సమీక్షలు లేక, నిధులు విడుదల చేయక, పారిశుద్ధ్య నిర్వహణ జరగకపోవడంతో దోమలు విజృంభించి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో జ్వరాల బారిన పడుతున్నారు. ప్రతి రెండు ఇండ్లలో ఒకరు వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నారు. ఆసుపత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి వచ్చిందంటే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం లేదు. మొద్దు నిద్ర వీడటం లేదు. పరిపాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రాజకీయాలు చేయడం, ప్రతిపక్ష నాయకుల మీద బురద జల్లడానికే ప్రాధాన్యమిస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య నిర్వహణ, ఆసుపత్రుల సన్నద్ధత వంటి ముఖ్యమైన అంశాలపై తక్షణం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి వైరల్ ఫీవర్స్ బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా చూడాలని ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# 'రుణం' తీరేనా..?

**- మాఫీ కోసం 3,305 మంది ఎదురుచూపు**

బోనకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు చేపట్టిన రుణమాఫీ బోనకల్ మండల వ్యాప్తంగా 9 సహకార సంఘాలలో కేవలం 54.76 శాతం మాత్రమే రుణమాఫీ అయింది. ఇంకా 45 శాతం రైతులకు రుణమాఫీ కావలసి ఉంది.బోనకల్ మండల వ్యాప్తంగా 9 సహకార సంఘాలు ఉన్నాయి. ఈ తొమ్మిది సహకార సంఘాలలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ అర్హత కలిగిన రైతులు 7,307 మంది ఉన్నారు. వీరందరికీ మొత్తం రూ. 46.87 కోట్లు రుణమాఫీ కావలసి ఉంది. కానీ 4,002 మందికి రైతులకు సంబంధించి రూ. 21.25 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. ఇంకా 3,305 మంది రైతులకు సంబంధించి రూ. 25.62 కోట్లు రుణమాఫీ కావలసి ఉంది. వీరందరికీ వివిధ కారణాలతో రుణమాఫీ కాలేదు.ముష్టికుంట సహకార సంఘంలో 377 మందికి, మోటమర్రి సహకార సంఘంలో 411 మందికి, రావినూతల సహకార సంఘంలో 336 మందికి, బ్రాహ్మణపల్లి సహకార సంఘంలో 386 మందికి, బోనకల్ సహకార సంఘంలో 388 మందికి, లక్ష్మీపురం సహకార సంఘంలో 697మంది



రైతులకి, నారాయణపురం సహకార సంఘంలో 197 మందికి, పెద్దబీరవల్లి సహకార సంఘంలో 243 మందికి, కలకోట సహకార సంఘంలో 270 మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డ్ ఆధారం చేయటం వలన అనేకమంది అర్హత కలిగిన రైతులు అనర్హులుగా మారిపోయారు. రుణమాఫీ కానీ రైతులందరూ ఎక్కువ శాతం రేషన్ కార్డు లేకపోవడం వల్లనే రుణమాఫీ జరగలేదు.

# నకిలీ రేషన్ కార్డులపై సర్కార్ గురి...

వరంగల్: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి స్కీమ్ కు తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు లింక్ పెట్టడంతో రేషన్ కార్డు లేని వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులుగా గుర్తింపు పొందక అయోమయంలో ఆందోళన చెందుతున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రేషన్ కార్డు ప్రామాణికం కాదంటూనే కొత్త రేషన్ కార్డులు త్వరలో ఇస్తామని ప్రకటిస్తుంది. అయితే ఆ రేషన్ కార్డుల ప్రక్రియ ఒక ప్రహసంగా మారే పరిస్థితి కనిపిస్తుంది. బోగస్ యూనిట్లు, కార్డులు తొలగించి నిర్దిష్టమైన కార్డులను కొనసాగిస్తూ కొత్త కార్డులు జారీ చేయనున్నారు.రేషన్ దుకాణం వారీగా ఏరివేత ప్రారంభం కానుండగా నేడో రేపో పౌరసరఫరాల అధికారులు డీలర్లతో సమావేశం నిర్వహించి మార్గదర్శకాలను వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సెప్టెంబర్ లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ సమయంలోగా ఏరివేతను పూర్తి చేసి కొత్త కార్డులు జారీ చేసే అవకాశముంది. యుద్ధ ప్రతిపాదికన చర్యలుంటేనే సాధ్యమవుతుండగా తదనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.కరీంనగర్ జిల్లాలో 566 రేషన్ దుకాణాలు, 2.74లక్షల కార్డు దారులు, 8.17లక్షల యూనిట్లున్నాయి. గతంలో 487 రేషన్ దుకాణాలుండగా కొత్తగా 79 ఏర్పాటు చేశారు. కార్డులు, యూనిట్ల ఏరివేతను రేషన్ డీలర్ పరిధిలో చేపట్టనున్నారు. రేషన్ డీలర్లు ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్(ఇ-పాస్) ద్వారా రేషన్ సరుకులను ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు.డూప్లికేట్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈకేవైసీ) చేపట్టనున్నారు. అందుకు ఇ-పాస్ మిషన్లోనే ప్రత్యేక సాఫ్ట్ వేర్ అనుసంధానించనున్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యం తీసుకోవాలంటే వేలిముద్ర వేస్తున్నట్లుగానే, రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేయాలి.కార్డులో ఎంత మంది ఉంటే అంతమంది వేలిముద్ర వేయాల్సిందే. ఒకవేళ వేలిముద్ర పడకుంటే ఐరిస్ ద్వారా నిర్ధారించనున్నారు. సదరు ప్రక్రియలో పాల్గొనకుంటే కార్డును రద్దు చేయనున్నారు. కుటుంబసభ్యులు వేలిముద్ర వేయకుంటే వారి పేరును కార్డు నుంచి తొలగించనున్నారని సమాచారం.ప్రభుత్వం పలుమార్లు బోగస్ కార్డుల ఏరివేత చేపట్టింది. 2018లో రెవెన్యూ, రేషన్ డీలర్లు సంయుక్తంగా ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. అనంతరం 2020లో రేషన్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధానం చేపట్టడంతో బోగస్ కార్డులను తొలగించారు. ఇందులో ఉద్యోగులూ ఉండటం విశేషం. 2016లోనూ 777 మంది ఉద్యోగుల కార్డులను తొలగించారు. సాంకేతిక పరిజ్ఞానం అనర్హులను పట్టిస్తుండగా తాజాగా ఇ-పాస్తో వేలిముద్రల ద్వారా నిర్ధారణ చేయనున్నారు. డి డూప్లికేట్ తరువాతే కొత్త కార్డులు ఈ నెలలోనే కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా అదంతా తప్పుడు ప్రచారమని అధికారులు కొట్టి పారేశారు. కాగా డి డూప్లికేట్ పూర్తయ్యాకే కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని సమాచారం. పెళ్లయిన వారితో పాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు, నూతనంగా జన్మించిన పిల్లలను కార్డులో చేర్చుకునేలా వెసులుబాటు కల్పించే అవకాశముంది.

# మళ్లీ చేరికలు....

వరంగల్: దాదాపు పక్షం రోజుల పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చారు. ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ఆయన హైదరాబాద్ కు చేరుకుని వెంటనే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మొన్నటి వరకూ చేరికలు నిలిచిపోయాయి. ఆషాఢమాసం కావడంతో చేరదామనుకున్న వారు కూడా మంచి ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఇక శ్రావణ మాసం వచ్చేసింది. మంచి ముహూర్తాలున్నాయి. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విదేశాల నుంచి రావడంతో తిరిగి కండువాలు కప్పుకోవడం మొదలవుతుందన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో జోరుగా సాగుతుంది. అనేక మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేతలతో ట్ లోకి వెళ్లారని తెలిసింది. ఇప్పటికే బీఆర్ఎస్ కు చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్సీలు, పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేసీఆర్ కు అత్యంత సన్నిహితులైన పోచారం శ్రీనివాసరెడ్డి లాంటి వారు కూడా పార్టీని వదలి పెట్టారు. దీంతో మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లు చేరేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ మేరకు రేవంత్ రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నారని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. మరో ఎనిమిది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలకు టచ్ లో ఉన్నారని చెబుతున్నారు. వీరంతా విడతల వారీగా ఈ నెల 22వ తేదీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరతారన్న టాక్ వినపడుతుంది. బీఆర్ఎస్ లో గెలిచిన ఎమ్మెల్యేలు వరసపెట్టి కాంగ్రెస్ లోకి వెళుతుండటం కొంత గులాబీ పార్టీలో ఆందోళన రేకెత్తిస్తుంది. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే తిరిగి టిక్కెట్లు ఇచ్చినా కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచి మరీ గెలిచిన ఎమ్మెల్యేలు జంప్ చేయడమేంటని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి టిక్కెట్లు కూడా రావని, టిక్కెట్ కోసం ఢిల్లీ చుట్టూ ప్రదిక్షిణలు చేయాలని కారు పార్టీ అగ్రనేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినా రేవంత్ రెడ్డి మాటలను ఎమ్మెల్యేలు లెక్క చేయడం లేదు.

మరో నాలుగేళ్లు అధికార పార్టీలో ఉండటమే మేలన్న అభిప్రాయానికి ఎక్కువ మంది వచ్చినట్లు సమాచారం. అందుకోసమే పెద్దగా పదవులపై హామీలు ఇవ్వకున్నా జంప్ చేయడానికి సిద్ధపడుతున్నారు. నిజానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో నేరుగా కేసీఆర్ మాట్లాడుతున్నారు. పార్టీని వీడతారని అనుమానం వచ్చిన ఎమ్మెల్యేలతో నేరుగా సమావేశమై వచ్చే ఎన్నికల్లో విజయం తమదేనని, పార్టీ మారి ఇబ్బందులు పడవద్దని సుతిమెత్తంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అయినా కేసీఆర్ మాటలు వారి చెవికెక్కడం లేదు. ఎమ్మెల్యేలు ఎక్కువ మంది పార్టీని వీడితే తమను మానసికంగా దెబ్బకొట్టాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారని కేసీఆర్ భావిస్తున్నారు. అందుకే బయటకు కనిపించకుండా వెళ్లేవారిని మనం ఆపలేమని, కొత్త నాయకత్వంపై దృష్టి సారించాలని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కేసీఆర్ చెప్పినట్లు తెలిసింది. ఎంతకాలం ఆపుతామని ఆయన అన్నట్లు తెలిసింది. మొత్తం మీద మళ్లీ తెలంగాణలో చేరికలు ఊపందుకోనున్నాయి.

# కరీంనగర్ డీసీసీ అధ్యక్ష కోసం పోటీ...

కరీంనగర్: కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిపై ఆసక్తికరమైన పోటీ నెలకొంది. సుదీర్ఘకాలం తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పలువురు అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీ రేసులో పలువురు నేతలు పదవిని ఆశిస్తున్నా ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయమే కీలకం కానున్నదని తెలుస్తోంది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనసాగుతున్నారు. ఆయన మానకొండూర్ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆయన స్థానంలో త్వరలోనే మరొకరిని నియమించే అవకాశం ఉండడంతో డీసీసీ అధ్యక్ష పదవిపై అందరి దృష్టి పడింది. ఎవరికి ఆ పదవి దక్కనున్నదోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిమితమైన కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రెండు చోట్ల.. బీఆర్ఎస్ మరో రెండు చోట్ల ప్రాతినిధ్యం వహిస్తోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలు కూడా కరీంనగర్ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. ఈ క్రమంలో జిల్లా రాజకీయాలపై పొన్నం ప్రభాకర్ ముద్ర ఉండటం ఖాయమని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సన్నిహిత అనుచరుడైన కవ్వంపల్లి సత్యనారాయణ టీడీపీ హయాం నుంచే సీఎంతో సత్సంబంధాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే సుదీర్ఘకాలంగా కవ్వంపల్లి డీసీసీ అధ్యక్షునిగా కొనసాగుతూ వచ్చారు. మానకొండూరు అసెంబ్లీ ఇన్ ఛార్జిగా పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ రావడంతో కవ్వంపల్లి ఆ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు ఏడాదిన్నర క్రితమే సిద్ధమైనా ప్రత్యామ్నాయ నేత కనిపించక ఆయననే కొనసాగిస్తూ వచ్చారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సూచన మేరకు మానకొండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను చక్కదిద్దుకుంటూనే జిల్లా పార్టీ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నెట్టుకువచ్చారు. అయితే పదవీకాలం ముగిసిన నేపథ్యంలో మరొకరికి ఈ బాధ్యతలు అప్పగించడం అనివార్యమయ్యింది.పీసీసీ చీఫ్ మారిన తర్వాత జిల్లాలకు కొత్త అధ్యక్షుల నియామకం జరగనుండటంతో మరొకరికి ఆ బాధ్యతలు అప్పగించడం తప్పనిసరి అని తేలిపోయింది. పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో డీసీసీ చీఫ్ బాధ్యతలు పెద్దగా ఇబ్బందికరం కాకపోవడంతో పలువురు నేతలు పోటీపడుతున్నారు. మరికొందరు సీనియర్ నేతలు డీసీసీ పదవికి బదులు నామినేటెడ్ పదవులను ఆశిస్తూ ముందే తాము పోటీలో లేమంటూ మంత్రి పొన్నం దృష్టికి తీసుకువెళ్లారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల లోక్ సభ అభ్యర్థిగా బరిలో నిలిచిన వెలిచాల రాజేందర్ రావు తెరపైకి రాగా మరికొందరు నేతలు కూడా రేసులోకి వచ్చారు. సీనియర్ నేతలు ఆకారపు భాస్కర్ రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, పలువురు మాజీ ఎమ్మెల్యేలు కూడా డీసీసీ చీఫ్ బాధ్యతలను ఆశిస్తూ తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తనకు సన్నిహితులుగా ఉన్నవారే డీసీసీ పీఠం కోసం పోటీపడుతున్న నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎవరికి మద్దతునిస్తారోనని పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొన్నది.డీసీసీ పగ్గాలు తనకు దక్కడం ఖాయమని వెలిచాల రాజేందర్ రావు గట్టి ధీమాతో ఉన్నారని తెలుస్తోంది. కరీంనగర్ లోక్ సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సంబంధాలు కలిగి ఉన్న రాజేందర్ రావు తనకు డీసీసీ బాధ్యతలు అప్పగిస్తే ప్రణాళికబద్ధంగా స్థానిక సంస్థల, మున్సిపల్, పంచాయతీరాజ్ ఎన్నికలకు పార్టీ క్యాడర్ ను సన్నద్ధం చేసే బాధ్యత తీసుకోగలుగుతానని ఇప్పటికే ముఖ్య నేతల వద్ద ప్రస్తావించారని తెలుస్తోంది. పార్టీ అధికారంలో ఉన్నందున ప్రతీ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవల్సిన అవసరం ఉందని.. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేందుకు తనకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు సీఎం సన్నిహితుల వద్ద కూడా వెలిచాల రాజేందర్ రావు తనవంతు ప్రయత్నాలు చేశారని చెబుతున్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా గతంలో పని చేసిన రాజేందర్ రావు చొప్పదండి అసెంబ్లీ స్థానం నుంచి ఒకసారి.. కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి ఒకసారి ప్రజారాజ్యం పార్టీ పక్షాన, ఇటీవల కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేశారు. అంగబలం, అర్థబలం పుష్కలంగా ఉన్న రాజేందర్ రావు తనకు డీసీసీ బాధ్యతలు అప్పగిస్తే పార్టీని బలోపేతం చేసేందు కు తనవంతు కృషి చేస్తానని చెబుతుండగా... పలువురు ముఖ్య నేతలు కూడా ఆయన పట్ల సానుకూలంగా ఉన్నారని ప్రచారం జరుగుతోందిడీసీసీ అధ్యక్ష పదవిపై కాంగ్రెస్ పార్టీ నేత ఆకారపు భాస్కర్ రెడ్డి గట్టి ఆశలు పెట్టుకున్నారు. యువజన కాంగ్రెస్ నుంచి దశాబ్దాలుగా పార్టీకి సేవలందిస్తూ వచ్చిన ఆకారపు భాస్కర్ రెడ్డి బీఆర్ఎస్ లో చేరి లోక్ సభ ఎన్నికల వేళ మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉత్తర తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా, కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షునిగా, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షు నిగా, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా, మున్సిపల్ కౌన్సిలర్ గా సుదీర్ఘ కాలం గా కాంగ్రెస్ రాజకీయాల్లో కీలకంగా పని చేస్తూ వచ్చారు. కుటుంబ సంబంధాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని వీడినా తిరిగి పార్టీలో చేరిన ఆకారపు భాస్కర్ రెడ్డి తనకు అవకాశం ఇస్తే మరింత క్రియాశీలకంగా పని చేస్తానంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువచ్చారని తెలుస్తోంది. గతంలో పొన్నం ప్రభాకర్ ఎన్ఎస్యూఐ అధ్యక్షునిగా.. ఆకారపు భాస్కర్ రెడ్డి యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా టీడీపీ అధికారంలో ఉన్న కాలంలో అనేక ఉద్యమాలను కలిసి చేపట్టారు. వీరిద్దరి మధ్య సత్సంబంధాలు ఉన్న నేపథ్యంలో తన అవకాశాలను పరిశీలించాలని భాస్కర్ రెడ్డి కోరుకుంటున్నారు.మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్ తనయుడు బొమ్మ శ్రీరాం చక్రవర్తి తోపాటు మాజీ ఎమ్మెల్యేలు ఆరపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణ గౌడ్ సైతం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. తెరచాటుగా పార్టీ ముఖ్యనేతలతో మంతనాలు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో జిల్లా అద్యక్ష పదవిపై పలువురు నేతలు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి జిల్లా నేతల ఆశిస్సులు ఎవరికి ఎక్కువగా ఉంటే వారికే ఆ పదవి దక్కే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది.

# రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన కొనసాగుతుంది..

జమ్మికుంట: రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన కొనసాగుతుందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు మండిపడ్డారు. మంగళవారం రోజున జమ్మికుంట పట్టణ బిజెపి అధ్యక్షులు జీడి మల్లేష్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు మద్దతుగా పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో రైతులకు అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించడం జరిగిందని దుయ్యబట్టారు. ముఖ్యంగా ప్రతి రైతుకు రెండు లక్షల వరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తానని చెప్పారని గుర్తు చేశారు.

ముఖ్యమంత్రి హోదాలో దేవుళ్ళ మీద ప్రమాణం చేసి రెండు లక్షల రుణమాఫీ ప్రతి ఒక్కరికి చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఇటు రైతులను, అటు దేవుళ్లను మోసం చేశాడని సంపత్ రావు చురకంటించారు. రాష్ట్రంలో వ్యవసాయ రుణం తీసుకున్న 45% మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని అన్నారు. (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) లెక్కల ప్రకారం రుణ మాఫీకి 49 వేల 500 కోట్లు అవుతుందని చెప్పారని, రాష్ట్ర క్యాబినెట్ కమిటీ 31 వేల కోట్లు అవుతుందని చెప్పిందని, కానీ బడ్జెట్ లో 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన రుణమాఫీ మొత్తం 17 వేల 933 కోట్లు మాత్రమేనని, దీనిని బట్టి రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి బట్టబయలైందని సంపత్ రావు, ఘాటుగా విమర్శించారు. రైతు రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఒకటి మాట్లాడితే వ్యవసాయ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మరొక్కటి మాట్లాడుతున్నాడని, ఇద్దరు పొంతనలేని విషయాలు చెబుతున్నారని, దీనితో రుణమాఫీ కాని రైతులు ఆందోళనగా ఉన్నారని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని సంపత్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేసే వరకు రైతులకు అండగ భారతీయ జనతా పార్టీ వుంటుందని,వారి పక్షాన ఉద్యమిస్తుందని తెలిపారు. రుణమాఫీ తో పాటు రైతులకు మరియు కౌలు రైతులకు 1 ఎకరాకు ఇస్తానన్న రైతు భరోసా15 వేల రూపాయలు,రైతు కూలీలకు ఇస్తానన్న 12 వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని ఈ సందర్భంగా సంపత్ రావు, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి శ్రేణులు చేసిన రాస్తారోకో తో పెద్ద ఎత్తున వాహనాలు రోడ్డుమీద ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న జమ్మికుంట ఎస్సై వివేక్, పోలీస్ సిబ్బందితో వచ్చి బిజెపి నాయకులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, పల్లపు రవి, ఠాగూర్ రాజేష్ ,కైలాస కోటి గణేష్, కొలకాని రాజు, మోతే స్వామి, ఎదలపురం అశోక్, ఇటిక్యాల స్వరూప, తూడి రవిచంద్ర రెడ్డి, కొమ్ము అశోక్, మేక సుధాకర్ రెడ్డి, ఠాగూర్ రాకేష్, గిరవేణి విజేందర్, గండికోట సమ్మయ్య, ఊడుగుల రవికుమార్, బూరుగుపల్లి రాము, గర్రెపల్లి నిరుపా రాణి, శనిగరపు రవి, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# హెచ్ఎండీఏలో కొత్త జోన్లు

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ నగరాలతో పోటీపడుతూ దూసుకువెళ్లుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి సైతం తన పోటీ పక్క రాష్ట్రాలతో కాదని, ప్రపంచంతోనే పోటీ పడుతున్నట్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ విస్తరణ, అభివృద్ధిపై కాంగ్రెస్ సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. భవిష్యత్ అవసరాలు, పరిపాలన దృష్ట్యా నగరాన్ని విస్తరించాలని భావిస్తోంది. హెచ్ఎండీఏలో కొత్త జోన్లను ఏర్పాటు చేసింది. గతంలో నాలుగు జోన్లు ఉండగా ఇప్పుడు వాటిని ఆరుకు పెంచింది.ప్రస్తుతం ఏడు జిల్లాల పరిధిలో హెచ్ఎండీఏ ప్రాంతం 7,200 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉండగా, త్వరలోనే రిజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) మొత్తం హెచ్ఎండీఏ పరిధిలోకి తెచ్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. హెచ్ఎండీఏలో గతంలో నాలుగు జోన్‌లు ఉండగా, నగరవాసులకు సేవలు అందించే విషయంలో ఇబ్బందులు తలేత్తేవి. తగినంత సిబ్బంది కూడా లేకపోవడంతో అప్లికేషన్ల పరిశీలనలో తీవ్ర జాప్యం చోటు చేసుకునేది. తాజాగా జోన్లను విభజించడంతో పాటు అదనపు సిబ్బంది నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. శంషాబాద్, ఘట్‌కేసర్ జోన్లను యథాతథంగా ఉంచి, శంకర్‌పల్లి, మేడ్చల్ జోన్లను రెండేసి జోన్లుగా విభజించనున్నారు.

ప్లానింగ్ ప్రక్షాళన..

ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఏళ్ల తరబడి ఒకే చోట ఉన్న అధికారులను బదిలీ చేస్తూ గతవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగేళ్లు అంతకు మించి ఉన్న వారిని బదిలీ చేశారు. డిప్యూటేషన్లపై ఉన్న వారికి స్థాన చలనం కల్పించారు. కొత్తగా ఏర్పడిన మేడ్చల్ జోన్-1 ప్లానింగ్ అధికారిగా గోపిక రమ్య, మేడ్చల్ జోన్-2 ప్లానింగ్ అధికారిగా కే.శాలినిని నియమించగా, మేడ్చల్ చీఫ్ ప్లానింగ్ అధికారిగా పనిచేసిన యశ్వంత్ రావును ఘట్‌కేసర్ జోన్‌కు బదిలీ చేశారు. శంకర్‌పల్లి జోన్ పీవో యాదగిరిరావును మాస్టర్ ప్లాన్ యూనిట్‌కు బదిలీచేశారు. కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి జోన్-1కు చీఫ్ ప్లానింగ్ అధికారి బి.ప్రసాద్ రావు, శంకర్‌పల్లి-2కు సీపీవో మల్లికార్జున రావును నియమించారు.

వివిధ జోన్లలో ప్రాంతాలు ఇలా..

మేడ్చల్-1

బాచుపల్లి, గుండ్ల పోచంపల్లి, నర్సాపూర్, శామీర్‌పేట, శివంపేట్, తుప్రాన్, మనోహర్‌బాద్.

మేడ్చల్-2

కొంపల్లి, మేడ్చల్, పీఎస్‌యూ గ్రిడ్ రోడ్, ఉప్పల్ భగాయత్, దుండిగల్, గండిమైసమ్మ, ములుగు, వర్గల్, కాప్రా.

ఘట్‌కేసర్..

కీసర, భువనగిరి, బొమ్మలరామారాం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్, పోచంపల్లి, బీబీ నగర్, మేడిపల్లి.

శంషాబాద్..

బాలాపూర్, ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూరు, మంచాల (కొంతభాగం) మహేశ్వరం, శంషాబాద్, ఫరూక్ నగర్, షాద్‌నగర్, కొత్తూర్, నందిగామ.

శంకర్ పల్లి -1

గండిపేట్, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్.

శంకర్‌పల్లి-2

అమీన్‌పూర్, పటాన్ చెరు, శంకర్‌పల్లి, సంగారెడ్డి, కంది, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర్.

# ఆగని విగ్రహ వివాదం

హైదరాబాద్: తెలంగాణలో మరో రాజకీయ వివాదం రాజుకుంటోంది. అధికార, విపక్షాల మధ్య సవాళ్ల ప్రతిసవాళ్లతో రోజురోజుకూ వేడెక్కుతోన్న రాజకీయంలో ఇప్పుడు రాజీవ్ గాంధీ ఎంటరయ్యారు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన గుర్తులు చెరిపేసేలా కాంగ్రెస్ కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తుండగా, రేవంత్ సర్కార్ మాత్రం తాను చెప్పిందే శాసనం అన్నట్లు దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇంతకీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తాజా వివాదమేంటి? ఈ వివాదానికి రాజీవ్ గాంధీకి సంబంధం ఏంటి?తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయం వాడివేడిగా సాగుతోంది. నిత్యం ఏదో అంశంపై ఇరుపార్టీలు ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడుతున్నాయి. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణంపై కొద్దిరోజులుగా మాటల యుద్ధం జరుగుతుండగా, ఇప్పుడు మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది సెక్రటేరియట్ ఎదుట మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టించాలనే కాంగ్రెస్ ప్రతిపాదనే ఇప్పుడు ఇరు పార్టీల మధ్య చిచ్చు రాజేసింది. సచివాలయంలో తెలంగాణా తల్లి విగ్రహం ఏర్పాటు కోసం అప్పటి బిఆర్ఎస్ సర్కార్ స్థలం కేటాయించింది. అయితే ఇప్పుడు అదే స్థలంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ప్రతిష్టించేందుకు కాంగ్రెస్ సిద్ధం అవుతుండటం అగ్గి రాజేస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చిన్నచిన్న అంశాలపైనా పెద్ద వివాదం కొనసాగుతోందంటున్నారు పరిశీలకులు. తెలంగాణలో బీఆర్ఎస్ పాలన గుర్తులను చెరిపేసేలా కాంగ్రెస్ అడుగులు వేయడం వల్లే ఇలాంటి వివాదాలు వస్తున్నాయని గులాబీదళం గుర్రుగా ఉంది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం చేసిన తర్వాత రాష్ట్రం పేరును సూచించే టీఎస్‌ను టీజీగా మార్చారు. దీనిపై ఇటు కాంగ్రెస్; అటు బీఆర్ఎస్లో విస్తృత చర్చ జరిగింది.చివరికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పట్టుదలే నెగ్గింది. ఇక ఆ తర్వాత రాష్ట్ర చిహ్నం మార్పుపైనా విస్తృత చర్చ జరిగింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర చిహ్నంలో తొలగిస్తామని స్వయంగా సీఎం రేవంతే ప్రకటించారు. అయితే కాకతీయ తోరణం తొలిగించడంపై వరంగల్ జిల్లా నేతల నుంచి? చార్మినార్‌ను తీసేయడంపై ఎంఐఎం నుంచి ఒత్తిడి వచ్చింది. అటు బీఆర్ఎస్ కూడా ఈ అంశాన్ని కోర్టులోనే తేల్చుకుంటామంటూ ప్రకటించింది.దీంతో వెనక్కి తగ్గిన సర్కార్ ఈ అంశంపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ప్రకటించింది. ఇక ఇప్పుడు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించడం, ఇందుకోసం గతంలో కేసీఆర్ సర్కార్ తెలంగాణ తల్లి విగ్రహానికి కేటాయించిన స్థలాన్ని ఎంచుకోవడమే వివాదమవుతోంది. తెలంగాణ ఆత్మగౌరవానికి సంబంధించిన భావోద్వేగాన్ని రగిల్చితే ఫలితం ఎలా ఉంటుందోనని టెన్షన్ కాంగ్రెస్‌లోనూ కనిపిస్తోంది. కానీ, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాత్రం ఎలాగైనా రాజీవ్ విగ్రహ ప్రతిష్ఠించాలనే నిర్ణయానికే కట్టుబడినట్లు చెబుతున్నారుఐతే మాజీ ప్రధాని విగ్రహం ఏర్పాటుపై రాష్ట్రంలో ఇతర పార్టీలతో సంప్రదించి.. ఏకాభిప్రాయం వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తే బాగుండేదని వాదన వినిపిస్తోంది. కానీ, ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంతోనే బీఆర్ఎస్ ఆందోళన చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చాక రాజీవ్ విగ్రహాన్ని తొలగించి.. తెలంగాణా తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ప్రకటన కాక పుట్టిస్తోంది.

# మహిళల రక్షణ కోసమే షీ టీమ్లు

కమాన్ పూర్: మహిళల భద్రత కోసమే షి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని షీ టీమ్ ఇన్చార్జ్ ఏఎస్ఐ మల్లన్న అన్నారు. పెద్దపల్లి లోని గాయత్రి ఇంటర్ మిడియాట్ కాలేజి విద్యార్థులకు భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని అన్నారు. ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీం సిబ్బంది స్నేహలత , సురేష్ తో పాటు విద్యార్థులు మరియు కాలేజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అట్టుడుకున్న మహారాష్ట్ర

ముంబై: కోల్ కతాలో ట్రైనీ డాక్టర్ పై హత్యాచార ఘటన మరువక ముందే మహారాష్ట్రలో నాలుగేళ్ల చిన్నారులపై లైంగిక దాడి ఘటన సంచలనంగా మారింది. మహారాష్ట్ర లోని థానే జిల్లా బద్లాపూర్ పట్టణంలోని ఓ ప్రముఖ పాఠశాలలో ఇద్దరు నాలుగేళ్ల చిన్నారులపై స్వీపర్ లైంగికదాడి ఘటన సంచలనం సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ చిన్నారులపై అఘాయిత్యం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఇటీవల పిల్లలు తీవ్ర నొప్పితో బాధపడుతుండగా, తల్లిదండ్రులు దవాఖానకు తీసుకెళ్లారు. దీంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు చేరుకొని యాజమాన్యాన్ని నిలదీశారు. వారు తమకేమి తెలువదని బుకాయించారు. ఇక విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు రంగంలోకి దిగాయి. ఆందోళనలు చేపట్టారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్వీపర్ ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. పాఠశాల యాజమాన్యం కేవలం క్షమాపణలు చెప్పి, తమ బాధ్యత కాదన్నట్లు ప్రవర్తించడంపై నిరసన కారులు మండిపడ్డారు. ప్రస్తుతం నిరసనకారుల ఆందోళనలతో బద్లాపూర్ అట్టుడుకుతున్నది. ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి బైఠాయించారు. పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘా నేతలు దాడికి దిగారు. ఇక బద్లాపూర్ రైల్వే స్టేషన్ పట్టాలపై ఆందోళనకారులు బైఠాయించారు. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక రైళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం 5 వరకు రైళ్లు స్టేషన్ లోనే వేచిచూస్తున్నాయి. మరికొన్నింటిని దారి మళ్లించారు. ఇక పట్టణంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. స్వయంగా సీఎం ఏక్ నాథ్ షిండే ఈ ఘటన పై ఆరా తీశారు. పోలీస్ , ఇతర శాఖల అధికారుల ద్వారా వివరాలు తెప్పించుకున్నారు. బద్లాపూర్ లో ఉన్న ఉన్నతాధికారులతో మంత్రులు పలుమార్లు మాట్లాడారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తున్నది. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని ఆందోళనకారులు మండిపడుతున్నారు. ఒక్కసారిగా స్థానిక ప్రజలు ఆగ్రహానికి లోనై, పాఠశాలపై దాడికి యత్నించారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని వర్గాల పిలుపు మేరకు బద్లాపూర్ లో మంగళవారం బంద్ పాటించారు. పెద్ద సంఖ్యలో వ్యాపారులు, రాజకీయ నాయకులు ఇందులో పాల్గొన్నారు. కోల్ కతా వైద్యురాలి ఘటన మరువక ముందే దేశవ్యాప్తంగా ఈ ఘటన పెను సంచలనమైంది. ఆందోళనకారులు పెద్ద ఎత్తున రోడ్లపై కి చేరారు. థానే రోడ్లు, రైల్వే స్టేషన్ జన దిగ్బంధంలో ఉండిపోయింది. పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను బద్లాపూర్ వ్యాప్తంగా మోహరించారు. అదనపు బలగాలను రప్పించారు. నిరసనకారులు హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇక బద్లాపూర్ ఘటనపై సీఎం ఏక్ నాథ్ షిండే స్పందించారు వెంటనే విచారణకు సిట్ ను ఏర్పాటు చేశారు. దోషులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. పాఠశాల ఘటనపై సిట్ ను ఏర్పాటు చేస్తూ డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ ఆదేశాలు జారీ చేశారు. ఐజీ ర్యాంక్ సీనియర్ ఐపీఎస్ ఆఫీసర్ ఆర్తి సింగ్ సారథ్యంలోని బృందం వెంటనే రంగంలోకి దిగింది. బద్లాపూర్ కు చేరుకుంది. కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ముందు ఉంచాలని థానే పోలీస్ కమిషనర్ ను ఆదేశించారు. దోషులకు త్వరగా శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు.

# ఎమ్మెల్యేలకు రుణమాఫీలు..

## సోషల్ మీడియాలో వైరల్

హైదరాబాద్, వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా మనకు కావాల్సినవి వస్తాయి అంటారు. ఇప్పుడు రుణమాఫీ సంగతి కూడా అలాగే ఉంది. అనర్హులంటూ రైతులకు రుణ మాఫీని దూరం చేస్తున్న రేవంత్ సర్కార్.. అయిన వారికి మాత్రం పైసా నష్టం లేకుండా చేస్తుంది. రుణమాఫీలో పేదోడి పొట్టగొడుతూ పెద్దోళ్ల గల్లాలు నింపుతోంది. ఇప్పటికే రాష్ట్ర రైతాంగం రుణమాఫీ కాలేదని రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే, పార్టీ ఎమ్మెల్యేలకు రుణమాఫీ చేసి తన విశాల హృదయాన్ని చాటుకుంది రేవంత్ సర్కార్. పేదల పక్షం అని చెప్పుకోవడం తప్ప చేతల్లో మాత్రం ఏం లేదన్న విమర్శలకు నిదర్శనంగా నిలుస్తోంది. బడా బాబులకు రుణమాఫీ చేస్తూ.. చిన్న సన్నకారు రైతులకు మొండి చేయి చూపిస్తోంది. పెద్ద పెద్ద బంగళాల్లో, మందీమార్బలం ఉండే ఎమ్మెల్యేలకు రుణ మాఫీ చేసిన ప్రభుత్వం సాదాసీదా రైతాంగాన్ని మాత్రం బ్యాంకుల చుట్టూ తిప్పిస్తోంది. సాక్షాత్తు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు రుణమాఫీ అయ్యిందన్న వార్త సరికొత్త చర్చకు దారితీస్తుంది. ఈ జాబితాలో చాలా మంది అధికార ఎమ్మెల్యేలు ఉండటం విశేషం. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బున్నోళ్లకు రుణమాఫీ చేస్తూ, పేద, దిగువ మధ్యతరగతి రైతులకు అన్యాయం చేసిందని మండిపడుతున్నారు. తెలంగాణలో చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నారు. రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు. బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలకు, నేతలకు మాత్రం రుణమాఫీ కావడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లాంటినేతలు ఈ జాబితాలో ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. తాండూరు డీసీసీబీ బ్యాంకులో ఆయనకు రూ. 1.50 లక్షల రుణం మాఫీ అయ్యింది. ఇక ఈ జాబితాలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం(రూ. 4,00,000), కవ్వంపల్లి సత్యనారాయణ (రూ. 1,27, 119), వేముల వీరేశం (రూ. 1,20,000), గండ్ర సత్య నారాయణ (రూ. 1,50,000), రాందాస్ మాలోత్ (రూ. 2,64,292), (రూ. 1,31,368), కోరం కనకయ్య (రూ. 2,12,780) కూడా ఉన్నారు. వీరికి సంబంధించిన డాక్యుమెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఎమ్మెల్యేలకు రుణమాఫీ నేపథ్యంలో రేవంత్ సర్కార్ రుణమాఫీ చేసింది రైతుల కోసమా, లేక కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసమా అన్న ప్రచారం జరుగుతోంది. రాజకీయ పలుకుబడి ఉన్న ఆసాములకు కూడా రుణమాఫీ అవుతోంది కానీ, తమకు మాత్రం కావడం లేదని రైతులు వాపోతున్నారు. అనర్హులుగా తమను జాబితాలో తొలగించిన ప్రభుత్వం? ట్యాక్సులు కట్టగల, డబ్బు, దస్కమున్న ఈ పెద్దలకు ఎలా రుణమాఫీ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. తమను మాత్రం బ్యాంకుల చుట్టూ తిప్పుతూ, వ్యవసాయ అధికారుల దగ్గరకు వెళ్లమనే చెప్పే ప్రభుత్వం వాళ్లకు ఎలా చేస్తుందని నిలదీస్తున్నారు.

# జార్ఖండ్ రాజకీయాల్లో కీలక పరిణామం

రాంచీ: జార్ఖండ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ సీఎం, జేఎంఎం సీనియర్ నాయకుడు చంపై సోరెన్ పార్టీ మారుతున్నట్లుగా వార్తలు బయటకు వచ్చాయి. అయితే ఆయన కొందరు ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీ కీలక నాయకులతో మంతనాలు జరిపినట్లు తెలుస్తున్నది. ఆయన వెంట ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఆయన ఇందుకు సంబంధించి ఒక పోస్ట్ కూడా సోషల్ మీడియాలో పెట్టారు. అయితే జార్ఖండ్ లో హేమంత్ సోరెన్ ప్రభుత్వం పడిపోతుందా..? ఎంతమంది ఎమ్మెల్యేలు చంపై వెంట బీజేపీలోకి వెళ్తున్నారనే విషయంపై మాత్రం స్పష్టత లేదు. అయితే బీజేపీ ప్రయత్నాలను మాత్రం సీఎం హేమంత్ సోరెన్ ఖండించారు. బీజేపీ శిఖండి రాజకీయాలు చేస్తుందంటూ మండిపడ్డారు. ఢిల్లీలో పరిణామాలను ఆయన నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎమ్మెల్యేలందరూ తనతో టచ్ లో ఉండాలని ఆదేశించారు. పార్టీ కీలక నేతలతో ఆయన మంతనాలు జరుపుతున్నారు. చంపై వెంట వెళ్లిన ఎమ్మెల్యేల వివరాలపై ఆరా తీస్తున్నారు. అయితే చంపై బయటకు వెళ్తే ప్రభుత్వం మారుతుందా..? అసలు జేఎంఎం ప్రభుత్వానికి మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేలు ఎందరు అనే వివరాలు తెలుసుకుందాం. జార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 82 మంది సభ్యులుఉన్నారు. వారిలో 81 మంది ప్రత్యక్షంగా , మరొకరు నామినేటెడ్ గా ఎన్నికవుతారు. ఇందులో జేఎంఎం కు 27 మది, కాంగ్రెస్ కు 17, ఆర్జేడీకి 1, కమ్యూనిస్ట్ పార్టీ కి ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ఇక బీజేపీకి 24. ముగ్గురు ఏజేఎస్ యూ, ఎన్సీపీకి ఒకరు, ఇద్దరు స్వతంత్రులు ఉన్నారు. ఇక 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి..అసెంబ్లీ సభ్యుల సంఖ్య 77కి పడిపోయింది. ఇందులో మెజార్టీకి 39 మంది మద్దతుల అవసరం. ప్రస్తుత ప్రభుత్వానికి 45 మంది సభ్యుల సపోర్ట్ ఉంది. ఇందులో చంపై వెంట ఆరుగురు వెళ్తే ఈ సంఖ్య 38కి పడిపోతుంది. దీంతో జేఎంఎం ప్రభుత్వం మైనార్టీలో పడిపోతుంది. ఇక చంపై వెంట ఏడుగురు బయటకు వెళ్తే.. వారి సభ్యత్వాన్ని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వాన్ని కాపాడుకునే అవకాశం హేమంత్ సోరెన్ కు ఉంది. వారి సభ్యత్వాన్ని రద్దు చేస్తే అసెంబ్లీ పూర్తి బలం 70 కి పడిపోతుంది. దీంతో మెజార్టీ సంఖ్య 36కి పడిపోతుంది. ఈ క్రమంలో ప్రభుత్వాన్ని కాపాడుకునే వీలు హేమంత్ సోరెన్ కు ఉంది. మరోవైపు బీజేపీ అవిశ్వాస తీర్మానం పెడితే పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై చర్చ నడుస్తున్నది. అయితే, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకసారి అవిశ్వాస తీర్మానం పెట్టారు. నాడు సీఎం గా ఉన్న చంపై సోరెన్ అందులో నెగ్గారు. మరి ఆరు నెలల్లోనే మరోసారి అవిశ్వాస తీర్మానం పెట్టడంపై కొంత అనుమానాలు ఉన్నాయి. కాగా, చంపై వెంట ఎమ్మెల్యేల సంఖ్య ఎంత అనే దానిపైనే ఇప్పుడు హేమంత్ సోరెన్ భవితవ్యం ఆధారపడి ఉంది. అయితే ఆయన ప్రస్తుతం పరిస్థితులను చక్కదిద్దే పనిలో పడ్డారు. ఇక చంపైని బీజేపీలోకి ఆహ్వానిస్తూ కేంద్ర మంత్రి జీతన్ రాయ్ మాంఝీ ఒక పోస్ట్ ఫెట్టారు. చంపై నువ్ పులివి.. నీకు మా కూటమిలోకి ఆహ్వానం అంటూ స్వాగతం పలికారు. అయితే ఇప్పుడు చంపై పెట్టిన పోస్టుపైనే అందరి దృష్టి నెలకొంది. 'ముఖ్యమంత్రి గా ఉండగా నా కార్యక్రమాలను రద్దు చేశారు. నన్ను రాజీనామా చేయమన్నారు. నా ఆత్మగౌరవం దెబ్బతినేలా ప్రవర్తించారు. జీవితాన్ని ధారబోసిన పార్టీలో నా ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైందని భావిస్తున్నా. నా ఈ ప్రయాణంలో ప్రత్యామ్నాయ మార్గాలు ఉంటాయని అనుకుంటున్నా.. నాది వ్యక్తిగత పోరాటం.. ఇందులోకి జేఎంఎం నాయకులను లాగొద్దు అంటూ చెప్పుకొచ్చారు. చెమటోడ్చి నిర్మించుకున్న పార్టీకి అన్యాయం చేయాలని కలలో కూడా అనుకోలేదు. అలాంటి పరిస్థితులను కల్పించారు.. అంటూ రాసుకొచ్చారు.' ఈ నేపథ్యంలోనే చంపై ఇక పార్టీ మారడం ఖాయమని తెలుస్తున్నది.

# ఇస్లామిక్ దేశంగా మారుతున్న స్వీడన్

న్యూఢిల్లీ : తమ దేశంలో ఉపాధి లేనప్పుడు? ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నప్పుడు, యుద్ధాలు జరుగుతున్నప్పుడు పొరుగు దేశాలకు వలసలు వెళ్లడం ప్రపంచంలో సర్వ సాధారణంగా మారింది. ఎక్కువ మంది విద్య, ఉద్యోగాల కోసం వలస వెళుతన్న దేశం అమెరికా. అగ్రరాజ్యానికి పొరుగు దేశాల నుంచే కాకుండా వివిధ దేశాల నుంచి ఏటా లక్షల మంది వలస వస్తుంటారు. వలసల నియంత్రణకు అమెరికా కూడా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు హెచ్1బీ వీసా ఉన్నవారినే అనుమతిస్తోంది. అయితే పొరుగున్న ఉన్న బ్రెజిల్, స్వీడన్ నుంచి ఎక్కువ మంది అక్రమంగా దేశంలోకి వలస వస్తున్నారు. వలసల సమస్య కూడా ఆ దేశ ఎన్నికల్లో ప్రభావం చూపుతుంది. ఇదిలా ఉంటే.. స్వీడన్ వాసులు ఎక్కువగా అమెరికా వంటి దేశాలకు వలస వెళుతుండగా.. శరణార్థులు మాత్రం స్వీడన్‌ను తమకు ఇష్టమైన గమ్యస్థానంగా మార్చుకున్నారు. దీంతో శరణార్థుల సంఖ్య ఏటేటా స్వీడర్‌లో భారీగా పెరుఉతోంది. స్వీడన్‌లో శరణార్థులు 20 లక్షలకుపైనే ఉంది. ఇది స్వీడన్ మొత్తం జనాభాలో ఐదో వంతు. అంటే 20% మరోవైపు తమ దేశం విడిచి వెళ్లేందుకు స్వీడిష్ ప్రభుత్వం డబ్బు చెల్లిస్తోంది. దీంతో స్వీడన్‌లోని స్థానిక పౌరులు అమెరికా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. అయితే, స్వీడన్ జనాభా మాత్రం పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం ముస్లిం శరణార్థులు. ఏటా ముస్లిం శరణార్థులు వేల మంది స్వీడన్‌కు వస్తున్నారు. దీంతో త్వరలోనే స్వీడన్ జనాభాను ముస్లిం శరణార్థులు మించిపోయినా ఆశ్చర్యం లేదు. స్వీడన్‌లో పెరుగుతున్న శరణార్థుల జనాభాను నియంత్రించేందుకు అక్కడి ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించింది. సిరియా, సోమాలియా, ఇరాన్ మరియు ఇరాక్ వంటి ఇస్లామిక్ దేశాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు ఇక్కడ నివసిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో స్వీడన్‌లో అనేక హింసాత్మక సంఘటనలు జరిగాయి. గతేడాది 348 కాల్పుల ఘటనలు జరిగాయి. ఈ దాడిలో 52 మంది చనిపోయారు. ఇందుకు శరణార్థులే కారణమని చెబుతున్నారు. ఈ దేశానికి 1990 నుంచి శరణార్థుల రాక మొదలైంది. మొదట్లో పెద్దగా పట్టించుకోలేదు. కానీ, ఇప్పుడు శరణార్థులే అసలు జనాభాగా మారిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో వారిని నియంత్రించేందుకు 2022 అక్టోబర్‌లో ఏర్పడిన ఉల్ఫ్ క్రిస్టర్సన్ ప్రభుత్వం శరణార్థుల నియంత్రణ చర్యలు చేపట్టింది. నేషనలిస్ట్ స్వీదన డెమొక్రాట్స్ పార్టీ కూడా ఆయనకు మద్దతు ఇస్తుంది. ఈ పార్టీ శరణార్థులకు వ్యతిరేకం, శరణార్థులు దేశ సంస్కృతిక కాకుండా ఆర్థిక వ్యవస్థకు కూడా హాని కలిగిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు..ఇదిలా ఉంటే.. శరణార్థుల భారం తగ్గించుకునేందుకు స్వీడన్ ప్రభుత్వం ఆ దేశం విడిచి వెళ్లే వారికి రూ. 80 వేలు ఇస్తుంది. స్వీడన్ మంత్రి మరియా స్టెన్నార్డ్ చేసిన కొత్త ప్రతిపాదన ప్రకారం, స్వీడన్ సంస్కృతిని ఇష్టపడని లేదా అంగీకరించని వాడు స్వీడిష్‌ను విడిచి పెట్టవచ్చు. స్వీడన్ పౌరులు, దేశం విడిచి వెళితే, ప్రభుత్వం వారికి 80 వేలు మరియు అద్దె ఇస్తుంది. ఈ డబ్బు దేశం విడిచి వెళ్లే ముందు ఒక్కసారి మాత్రమే ఇవ్వబడుతుంది. దేశం విడిచి వెళ్లే వారికి ఇచ్చే డబ్బును రూ. 12 లక్షలకు పెంచాలనే ఆలోచన ఉంది. అయితే దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దేశం విడిచి వెళ్లి వారికి ఎక్కువ జీతం ఇస్తే స్వీడిష్ ప్రజలు ఇష్టపడరు' అనే సందేశం పంపుతుందని ప్రభుత్వం పేర్కొంది.

# ట్రాఫిక్ జాం... క్యాబ్ ల మోత

హైదరాబాద్: రాజ్ ఆకుల అనే వ్యక్తి పని మీద ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తన కార్యాలయానికి వెళ్లాలనుకున్నాడు. వర్షం పడుతున్నందున క్యాబ్ బుక్ చేసుకున్నాడు. ఆయన క్యాబ్ ఎక్కినప్పుడు ఫేర్ రీజనబుల్ గానే ఉంది. కానీ గమ్యానికి చేరుకునేసరికి మైండ్ బ్లాంక్ అయిపోయింది. బిల్లు రూ. 3100 చూపించింది. కట్టక తప్పదు కాబట్టి కట్టేశారు. రాజ్ ఆకుల ప్రయాణిస్తున్నప్పుడు వర్షం పడింది. ట్రాఫిక్ జామ్ అయింంది. ఈ కారణంగా బాగా ఆలస్యం అయింది. అయితే అంత మాత్రాన... ఒక్క సారే .. వందల నుంచి వేలకు బిల్లు తీసుకెళ్తారా అని ఆశ్చర్యపోయారు. కస్టమర్ కేర్‌ను సంప్రదిస్తే.. బిల్లింగ్‌లో ఎలాంటి పొరపాటు లేదని.. అది సరైన చార్జీనేనని స్పష్టం చేశారు. దీంతో ఇది కార్పొరేట్ లూఠీ అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఉబెర్‌కు.. కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖకూ ట్యాగ్ చేశారు. రాజ్ ఆకుల ట్వీట్ కింద క్యాబులతో తాము పడిన బాధల్ని ఇతరులు పంచుకోవడం ప్రారంభించారు. క్యాబుల్ని తరచూ బుక్ చేసుకునేవారందరికీ ఇలాంటి అనుభవాలు ఉన్నాయని ఆ ట్వీట్ల రిప్లయ్‌లను చూస్తే అర్థమవుతుంది. గత వారం రోజులుగా రోజూ ఉదయం పూట ఎం.. మధ్యాహ్నం నుంచి వర్షం దంచి కొడుతోంది. ఆ వర్షాలుమామూలువి కావు.

రోడ్లు బ్లాక్ అయిపోతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్ జామ్ అయిపోయి వాహనాలు ఎక్కడివక్కడ ఆగిపోతున్నాయి. గంటల తరబి ముందుకు కదలడం లేదు. ఈ ట్రాఫిక్‌లో క్యాబ్ ఇరుక్కుపోతే.. డ్రైవర్లు దిలాసాగానే ఉంటున్నారు. కానీ ప్యాసింజర్లకు మాత్రం గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొన్ని ఏరియాల్లో క్యాబుల్లో వెళ్తున్న వారి జేబుకు చిల్లులు పడుతున్నాయి.

# హైదరాబాద్ లో ఈవెన్ ఆడ్ నెంబర్..?

హైదరాబాద్: హైదరాబాద్ నగరం అంటే అందరికీ ఇష్టమే. మంచి వాతావరణం. అన్ని మతాలు, కులాలు, రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకుని ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. హైదరాబాద్‌కు వచ్చామంటే బతకడం పెద్ద కష?టం కాదు. పేదల నుంచి ధనవంతుల వరకూ అనువైన నగరంగా హైదరాబాద్ కు పేరుంది. 1990 దశకం నుంచి హైదరాబాద్ నగరానికి ప్రజల తాకిడి పెరిగింది. అప్పటి వరకూ పెద్దగా హైదారాబాద్ రాని వాళ్లంతా ఉపాధి అవకాశాల కోసం ఈ సిటీకి చేరి ఎక్కడో ఒక చోట బతుకీదుస్తున్నారు. తమ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పుడున్న హైదరాబాద్ నగరం విస్తీర్ణం మొత్తం 650 చదరపు కిలోమీటర్లుగా ఉంది. కానీ హైదరాబాద్ జనాభా ఇప్పటికే కోటి దాటింది. కోటి మందికి ఆశ్రయమిస్తున్న ఈ నగరంలో అన్ని రకాలు, వర్గాల వారికి అనువైన ప్రదేశంగా భావిస్తుంటారు. నెలకు ఐదు వేల రూపాయలు వచ్చే వారి నుంచి నెలకు ఐదు లక్షలు సంపాదించే వాళ్లు సయితం తమ స్టయిల్ లో బతికేందుకు అవసరమైన సిటీగా పేరుంది. పూరి గుడెసె నుంచి అధునాత భవంతుల్లో నివాసముంటున్న వారు ఇక్కడ ఉన్నారు. అన్ని రాష్ట్రాలకు చెందిన ఆహారం ఇక్కడ అందుబాటులో ఉంటుంది. అందుకే హైదరాబాద్ లో ఒకసారి ఉపాధి కోసం వచ్చిన వారు ఇక నగరాన్ని వదిలిపెట్టరనేది అంతే వాస్తవం. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా వ్యవస్థను రూపొందించారు. మెట్రో రైలు మార్గాన్ని నిర్మించారు. ఎంఎంటీఎస్ రైళ్లు ఉన్నాయి. కానీ నిత్యం ట్రాఫిక్ సమస్యలే. వర్షం పడినా.. పడకపోయినా.. ట్రాఫిక్ తిప్పలు మామూలు కావు. హైదరాబాద్ లో ఒకచోట నుంచి మరొకచోటకు ప్రయాణమంటే నరకాన్ని చవిచూడాల్సి వస్తుంది. రోడ్లు వెడల్పు చేసినా ఫలితం లేదు. ఫ్లై ఓవర్లు దాదాపు ఇరవై నుంచి ముప్పయి వరకూ ట్రాఫిక్ రద్దీ ఉన్న ప్రాంతాల్లో నిర్మించినా అంతే. గతంలో సోమవారం నుంచి శుక్రవారం వరకూ హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. కానీ ఇప్పుడు శని, ఆదివారాలు సెలవు దినాల్లో సయితం ట్రాఫిక్ సమస్య తలెత్తుతూనే ఉంది. సరి – బేసి విధానం... ట్రాఫిక్ పోలీసులు అనేక చర్యలు తీసుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు పెడుతూ ట్రాఫిక్ ను కంట్రోల్ చేయడానికి సిబ్బంది పడుతున్న కష్టం మాత్రం సత్ఫలితాలనివ్వడం లేదు. ఇన్ని సదుపాయాలున్నా ఎక్కువ మంది ప్రజలుసొంత వాహనాలను రోడ్లపైకి తెస్తుండటంతోనే ఈ సమస్య తలెత్తుతుందంటున్నారు. అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాన్ని కూడా ప్రజలు ఉపయోగ పడటం లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే భవిష్యత్ లో హైదరాబాద్ నగరంలో ప్రయాణం నరకంగా మారే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది. ఢిల్లీ తరహాలోనే ట్రాఫిక్ ను నియంత్రించేందుక సరి – బేసి విధానాన్ని పాటిస్తే మంచిదన్న సూచనలు వినపడుతున్నాయి. వర్షాకాలం హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు పనిచేయకుండా వర్క్ ఫ్రం హోం చేసుకుంటే మంచిదన్న సలహాలు వినవస్తున్నాయి. లేకపోతే కిలోమీటరు ప్రయాణించాలంటే గంటపట్టే అవకాశముంది.

# హైదరాబాద్ వాసులకు పోలీసులు మరో అలర్ట

హైదరాబాద్: నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిగణలోకి తీసుకుని కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు. అయితే. నగరంలో భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయని తద్వారా మిగతా వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుందని పలువురు నగరవాసులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రైమ్ టైంలోనే భారీ వాహనాలు రోడ్లపై తిరుగుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి. ఆఫీసులకు వెళ్లే వారికి స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే వారికి ఇబ్బందిగా మారినట్టు పోలీసుల దృష్టికి వచ్చింది. అంతేకాకుండా ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదా లు కూడా జరుగుతున్నాయని పోలీసులు గమనించారు. ఈ నేపథ్యం లోనే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించటంతో పాటు ప్రమాదాల నివారణకు నగరంలోకి పలు వాహనాల రాకపోకలను రద్దు చేస్తూ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ నేఫథ్యంలోనే భారీ వాహనాలు, నేషనల్ పర్మిట్ లారీలు, లోకల్ లారీలు డీసీఎంలు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ప్రైవేటు బస్సులపై ఆంక్షలు విధించారు. లోకల్ లారీలు, భారీ వాహనాలకు ఉదయం 7 గంటల తర్వాత నగరంలోకి ఎంట్రీ లేదని నిబంధనలు జారీ చేశారు. ఇఖ వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్ వచ్చే ప్రైవేటు బస్సులకు ఉదయం 8 గంటల తర్వాత నగరంలోకి ఎంట్రీ లేదని ఆదేశించారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రైవేటు బస్సులను నగరంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేసేశారు. నగరంలోకి భారీ వాహనాలు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి 11: 00 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు సామాగ్రిని తరలించే స్థానిక వాహనాలను అనుమతిస్తామని పేర్కొ న్నారు. నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని 94 మార్గాల్లో ఈ నిబంధ నలు వర్తిస్తాయని సీపీ వివరించారు. కేటాయించిన సమయానికి మించి భారీ వాహనాలు నగరంలోని రోడ్ల మీద తిరుగుతు న్నాయని, పోలీసులకు ఇప్పటికే పలు కంప్లైంట్లు వచ్చాయి. ఇక 2 రోజుల క్రితం హబ్సిగూడలో లారీ ఢీకొని ఓ పదో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటనకు కూడా ఇదే కారణమని స్థానికులు విరుచుకుపడగా,పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# పిల్లలమర్రిని పున:ప్రారంభించిన మంత్రి జూపల్లి

మహబూబ్ నగర్: ప్రసిద్ధి చేందిన పిల్లలమర్రిని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పున:ప్రారంభించారు. బుధవారం నుంచి సందర్శకులకు అనుమతి ఇచ్చారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల మాదిరిగానే రాష్ట్రంలో టూరిజాన్ని అభివృద్ధి చేస్తాం. టూరిజం అభివృద్ధికి అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. రాష్ట్రంలో టూరిజంతో పాటు అన్ని రంగాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కృత నిశ్చయం తో ఉందని అన్నారు. తూర్పు మధ్య ఆసియా దేశాలకి మించిన పర్యాటక ప్రాంతాలు మనదేశంలో, ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. వాటి అన్నిటిపై విస్తృత ప్రచారం చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఉన్న అన్ని టూరిజం కేంద్రాలలో పర్యాటకులలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం. టూరిజంకు మార్కెట్ కల్పించనున్నాం. యాంత్రిక జీవనంలో టూరిజం వల్ల వినోదం కలుగుతుంది. మహబూబ్ నగర్ జిల్లా టూరిజం అభివృద్ధికి తక్షణమే రూ 5 కోట్ల రూపాయలను ప్రకటిస్తున్నాం. ఆసియా ఖండంలోనే అత్యంత పేరు ప్రఖ్యాతలుగాంచిన పిల్లలమర్రి చెట్టును పర్యటకులకు ఈరోజు నుండి అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నాం. ముఖ్యంగా నల్లమల అభయారణ్యం, మల్లెల తీర్థం, సోమశిల ,సరళసాగర్, కోయిల్ సాగర్ తో పాటు, ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నిటిని కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 150 కిలోమీటర్ల నిడివి గల కృష్ణానది ఉంది. కృష్ణ బ్యాక్ వాటర్ లో వాటర్ స్పోర్ట్స్, బోటింగ్ ఏర్పాటు చేస్తాం. రామప్ప గుడి, పాండవుల గుట్ట, గోల్కొండ వంటి ఎన్నో పర్యాటక, చారిత్రక ప్రదేశాలు చూడాల్సినవి ఉన్నాయి. ప్రతి ఒక్కరు నెలలో కనీసం ఒక్కసారైనా మానసికొల్లసం కోసం పర్యాటక ప్రాంతా లు సందర్శించాలి. రాష్ట్రంలో టెంపుల్ టూరిజంతో పాటు, ఎకో టూరిజం అభివృద్ధి చేస్తాం. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం లో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, మహబూబ్ నగర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# హర్యానా అసెంబ్లీ ఎన్నికల బరిలో వినేష్ ఫోగట్.. అదే బాటలో మరికొంత మంది క్రీడాకారులు



క్రీడా రంగంలో తమ ప్రత్యర్థులను ఓడించిన హర్యానాకు చెందిన ఆరుగురికి పైగా క్రీడాకారులు ఈసారి అసెంబ్లీ ఎన్నికల రాజకీయ పిచ్‌పై తమ సత్తాను చాటేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒలింపియన్లు జరంగ్ పునియా, వినేష్ ఫోగట్, రెజ్లర్ సాక్షి మాలిక్‌లపై కాంగ్రెస్ కన్నేసింది. ఎంపీ దీపేంద్ర హుడా స్వయంగా ఇద్దరు ఆటగాళ్లతో చాలా కాలంగా టచ్‌లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. బజరంగ్ పునియా ఝజ్జర్‌కు చెందినవాడు. వినేష్ ఫోగట్ బద్రా ప్రాంత నివాసి. అయితే ఇద్దరు ఆటగాళ్లు ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తుంది. అదే సమయంలో.. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై ముగ్గురు ఒలింపియన్లు బరిలోకి దిగారు. వారు మళ్లీ టికెట్ కోసం కసరత్తు చేస్తున్నారు. ఒలింపియన్ యోగేశ్వర్ దత్ 2019 ఎన్నికల్లో బరోడా నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేశారు. ఆ తర్వాత ఉపఎన్నికల్లో కూడా బీజేపీ నుంచి పోటీ చేసిన ఆయన.. రెండుసార్లు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అదేవిధంగా ఒలింపియన్, క్రీడాకారిణి బబితా ఫోగట్ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో చర్ఖీ దాద్రీ నుండి బిజెపి టిక్కెట్‌పై పోటీ చేసింది. అయితే స్వతంత్ర అభ్యర్థి సోంబిర్ సాంగ్వాన్ చేతిలో ఆమె ఓడిపోయారు. మాజీ హాకీ కెప్టెన్ సందీప్ సింగ్ బీజేపీ టిక్కెట్‌పై పెహోవా నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన మనోహర్ లాల్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. ఈ ముగ్గురు ఆటగాళ్లు మళ్లీ వారి వారి సర్కిల్‌లలో చురుకుగా ఉన్నారు. టిక్కెట్ కోసం తమ వాదనను బలంగా వినిపిస్తున్నారు. అయితే.. మాజీ క్రీడా మంత్రి సందీప్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన జూనియర్ మహిళా కోచ్ పెహోవా అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ నుంచి టికెట్ కోరింది. అసెంబ్లీ ఎన్నికల్లో సందీప్ సింగ్‌పై పోటీ చేసేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు. బాక్సింగ్ ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన విజేందర్ సింగ్ ఇప్పుడు బీజేపీలో చేరారు. 2019లో దక్షిణ ఢిల్లీ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. 2019లోనే ఆయన కాంగ్రెస్‌లో చేరారు. విజేందర్ సింగ్ హర్యానా, పశ్చిమ ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్‌లలో పెద్ద మొత్తంలో రాజకీయ ప్రభావాన్ని కలిగి ఉన్న జాట్ కమ్యూనిటీ నుండి వచ్చారు. అయితే.. 2024 ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరాడు. రాజకీయవేత్తగా మారిన క్రికెటర్ చేతన్ శర్మ 2009 లోక్‌సభ ఎన్నికల్లో ఫరీదాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి బహుజన్ సమాజ్ పార్టీ తరపున పోటీ చేశారు. చేతన్ శర్మ బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందినవాడు. చేతన్ శర్మ 1,13,453 మెజార్టీతో విజయం సాధించారు. అయితే ఆ తర్వాత ఆయన బీజేపీలో చేరి స్పోర్ట్స్ సెల్ కన్వీనర్‌గా ఉన్నారు. ఆయన కూడా మరోమారు ఎన్నికల బరిలో ఉంటారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి.

# ఆ ట్రోఫీ అందుకుంటామని ఆశిస్తున్నా: మిచెల్ స్టార్క్



ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌కు ఇంకా మూడు నెలల సమయం ఉంది. ఇప్పట్నుంచే ప్రస్తుత, మాజీ క్రికెటర్లు బోర్డర్-గావస్కర్ ట్రోఫీ గురించి కామెంట్లు చేయడం మొదలెట్టారు. స్వదేశంలో గత రెండుసార్లు టైటిళ్లను ఆసీస్ కోల్పోయింది. ఈసారి ఎలాగైనా సొంతం చేసుకోవాలని భావిస్తుండగా.. భారత్ మాత్రం హ్యాట్రిక్‌పై గురి పెట్టింది. ఈ క్రమంలో ఆసీస్ స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ మాత్రం టీమ్ఇండియాకు చెక్ పెడతామని నమ్మకంగా చెబుతున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు మళ్లీ చేరుతామనే ఆశాభావం వ్యక్తం చేశాడు. భారత్‌తో టెస్టు సిరీస్ అంటే తమకు యాషెస్‌తో సమానమని వ్యాఖ్యానించాడు. యాషెస్ సిరీస్‌లోనూ ఇంగ్లాండ్‌తో ఆసీస్ ఐదు టెస్టులు ఆడే విషయం తెలిసిందే. "యాషెస్ సిరీస్‌తో సమంగా భారత్‌తో ఐదు టెస్టులో తలపడేందుకు ఆసక్తిగా ఉన్నాం. ప్రతి మ్యాచ్‌ను గెలిచేందుకు ప్రయత్నిస్తాం. ఇక మా సొంత గడ్డపై ఇంకాస్త ఎక్కువ శ్రమిస్తాం. భారత జట్టు బలమైంది. టెస్టు క్రికెట్‌లో మేం రెండు పటిష్ఠమైన టీమ్‌లతో పోరాడుతున్నాం. జనవరి 8న మేం బోర్డర్ - గావస్కర్ ట్రోఫీతో ఉంటామని ఆశిస్తున్నా. టెస్టులకే నేను మొదటి ప్రాధాన్యత ఇస్తా. రాబోయే కొద్ది రోజుల్లో మేం ఏడు టెస్టులు ఆడనున్నాం. అందులో రెండు శ్రీలంకతో ఉంటాయి. షెడ్యూల్ కాస్త కఠినంగా ఉంది. జోష్ హేజిల్‌వుడ్, పాట్ కమిన్స్, నేను మూడు ఫార్మాట్లలోనూ ఆడుతున్నాం. ఏ ఫార్మాట్‌ను ఎప్పుడు వదిలేస్తాననేది ఇప్పుడే చెప్పలేను. ఎప్పటి వరకు మ్యాచ్‌లకు నా శరీరం సహకరిస్తుందో.. అప్పటి దాకా ఆడేందుకు ప్రయత్నిస్తా" అని 34 ఏళ్ల స్టార్క్ వెల్లడించాడు.

**వారిద్దరు సక్సెస్ అయితే చాలు: కమిన్స్**

భారత్‌తో జరిగే బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో ఆసీస్ విజయం సాధించాలంటే ఇద్దరు ఆల్‌రౌండర్లు విజయవంతం కావాలని కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. "ఏ ఫార్మాట్ క్రికెట్‌లోనైనా ఆల్‌రౌండర్లదే కీలక పాత్ర. మా జట్టులోనూ చాలా మంది ఉన్నారు. అయితే, భారత్‌తో టెస్టు సిరీస్‌లో కామెరూన్ గ్రీన్, మిచెల్ మార్ష్ విజయవంతమైతే మాకు తిరుగుండదు. ఇద్దరూ నాణ్యమైన ఆల్‌రౌండర్లు. బ్యాటింగ్‌లో టాప్-6లో ఉంటారు. బౌలింగ్‌లోనూ పేస్ భారాన్ని మోస్తారు" అని కమిన్స్ తెలిపాడు. నవంబర్ 22న తొలి టెస్టు మొదలు కాగా.. జనవరి 7న చివరి టెస్టు ముగియనుంది.

# కోహ్లి అలా ఉండడు.. అప్పుడు ఎంతో మద్దతుగా నిలిచాడు: ఆర్సీబీ బౌలర్



ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ లో యశ్ దయాళ్.. ఈ పేరు వినగానే అతడి బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో రింకు సింగ్ కొట్టిన ఐదు సిక్స్‌లే గుర్తుకు వస్తాయి.

2023వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన ఈ బౌలర్ ఆ ఘటన తర్వాత తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడ్డాడు. ఆ తర్వాత సీజన్‌లో బెంగళూరు జట్టు కు మారి మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆ సమయంలో ఆర్సీబీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఎంతగానో సహకరించాడని తెలిపాడు. అతడిని ప్రశంసలతో ముంచెత్తాడు. తాజాగా ఓ క్రీడా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యశ్ మాట్లాడుతూ.. తనలో ఆత్మవిశ్వాసం తిరిగి నింపేందుకు విరాట్ ఇచ్చిన మద్దతు మరువలేనిదని పేర్కొన్నాడు. "సీజన్ మొత్తం నాకు మద్దతుగా నిలుస్తానని కోహ్లి చెప్పాడు. అదే నాకు అతి పెద్ద విషయం. కొత్త ప్రదేశానికి వచ్చావని అనుకోవద్దన్నాడు. అతడి మాటలు ఎంతో ప్రోత్సాహకరంగా నిలిచాయి. యువ ఆటగాళ్లతో అతడు చక్కగా మాట్లాడతాడు. టీవీల్లో అతడి గురించి మాట్లాడే విధంగా అతడు లేడు. నేను విరాట్ గురించి అలా అనుకోవడం లేదు" అని పేర్కొన్నాడు.

యశ్‌ను ఆర్సీబీ గత సీజన్లో రూ. 5 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. జట్టు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. అతడు 15 వికెట్లు తీశాడు.

ఇక విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి 16 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అతడిని బీసీసీఐ కార్యదర్శి జైషా అభినందించిన విషయం తెలిసిందే. "16 ఏళ్ల క్రితం 19 ఏళ్ల కోహ్లి.. అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. నిజమైన లెజండరీ కెరీర్‌కు అదే ఆరంభం. విరాట్‌కు అభినందనలు" అంటూ ఎక్స్‌లో షా పోస్టు పెట్టారు. 2008 ఆగస్టులో శ్రీలంకతో వన్డేల ద్వారా విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన విషయం తెలిసిందే.

# ఆడమ్ గిల్‌క్రిస్ట్ చెప్పిన టాప్-3 వికెట్ కీపర్లు ఎవరో తెలుసా? ధోనీ గురించి ఏమన్నాడంటే



ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ పేరు క్రికెట్ ప్రేమికులకు సుపరిచితమే. ప్రస్తుతం అతను ఓ ఇంగ్లీష్ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచంలో మీ దృష్టిలో బెస్ట్ వికెట్ కీపర్లు ఎవరు అని ప్రశ్నించగా.. ముగ్గురు పేర్లను ప్రస్తావించాడు. అతని అత్యుత్తమ వికెట్ కీపర్ల జాబితాలో ఎంఎస్ ధోనీ కూడా ఉన్నాడు. గిల్‌క్రిస్ట్ ధోని గురించి మాట్లాడుతూ.. ధోనీ ఎంత క్లిష్టపరిస్థితుల్లోనైనా చాలా ప్రశాంతంగా వికెట్ కీపింగ్ చేస్తాడు. అంతే స్థాయిలో బ్యాటింగ్ లోనూ రాణించగల సత్తా ఉంది. తనకు ఏ చిన్న అవకాశం వచ్చినా మ్యాచ్ ను తమవైపుకు తిప్పుకొనే సత్తా కలిగిన వ్యక్తి ధోనీ అంటూ ప్రసంశించాడు. అతని దృష్టిలో ప్రపంచ క్రికెట్ లో టాప్ -3 వికెట్ కీపర్ల జాబితాలో ధోనీకి రెండో స్థానాన్ని ఇచ్చాడు.

ఆడమ్ గిల్‌క్రిస్ట్ దృష్టిలో ప్రపంచ నవంబర్ వన్ వికెట్ కీపర్ రోడ్నీ మార్ష్. అతని గురించి మాట్లాడుతూ.. మార్ష్ నాకు ఆదర్శం. నేను అతనిలా ఉండాలనుకున్నాను. మార్ష్ 1970 నుంచి 1984 మధ్య ఆస్ట్రేలియా తరపున 96 టెస్టులు ఆడాడు. గిల్‌క్రిస్ట్ జాబితాలో మూడో బెస్ట్ వికెట్ కీపర్ కుమార సంగక్కర. అతని గురించి గిల్‌క్రిస్ట్ మాట్లాడుతూ.. కుమార సంగక్కర టాప్ ఆర్డర్ లో బ్యాటింగ్ చేసినా, వికెట్ కీపింగ్ అయినా ప్రతి విషయంలోనూ అత్యుత్తమంగా ఉంటాడని కొనియాడాడు. అదేవిధంగా భారత్ జట్టుతో జరగబోయే బోర్డర్ -గవాస్కర్ సిరీస్ లో ఆస్ట్రేలియా విజయం సాధిస్తుందని గిల్‌క్రిస్ట్ అభిప్రాయపడ్డారు. స్వదేశంలో ఆస్ట్రేలియా జట్టుదే ఆధిపత్యం ఉంటుంది. అయితే, విదేశాల్లో ఎలా గెలవాలో భారత్ జట్టుకు తెలుసు. సహజంగా నేను ఆస్ట్రేలియా గెలుస్తుందని ఆశించినా.. ఇరు జట్ల మధ్య పోటీ హొరాహొరీగా ఉండే అవకాశం ఉంటుందని గిల్ క్రిస్ట్ అభిప్రాయపడ్డాడు. ఈ ఏడాది నవంబర్ 22 నుంచి భారత్ %-% ఆస్ట్రేలియా జట్ల మధ్య బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ సిరీస్ ఆస్ట్రేలియాలో ప్రారంభం కానుంది. ఈ సిరీస్ లో మొత్తం ఐదు మ్యాచ్ లు జరగనున్నాయి.

# తిండికి, శిక్షణకు పైసల్ లేవు.. ఒలింపిక్ కల అప్పుడే కన్నాను



ఒలింపిక్స్ పతకం ప్రతి అథ్లెట్ కల. విశ్వ క్రీడల మెడల్ మెడలో పడిన రోజున క్రీడాకారుల ఆనందానికి హద్దే ఉండదనుకో. దేశం తరఫున పతకం గెలిచిన క్షణం నుంచే వాళ్ల జీవితం మారిపోతోంది. అప్పటిదాకా వాళ్లు పడిన కష్టాలు ఒక్కసారిగా కనుమరుగవుతాయి. భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ (%ూమిుఅ రావష్రతీుుష్%) విషయంలో ఇప్పుడు అదే జరుగుతోంది. ఒకప్పుడు తిండికోసం, రెజ్లింగ్ శిక్షణ కోసం ఎంతో కష్టపడిన అమన్.. ఇప్పుడు పెద్ద మొత్తంలో కానుకలు, సత్కారాలు అందుకుంటున్నాడు.

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్యను ఆరుకు పెంచిన అమన్ జీవితంలో ఎన్నో కష్టాలు పడ్డాడు. కుస్తీ పోటీల్లో ఆరితేరిన అతడి జీవితంలో చిన్నప్పటి నుంచి కష్టాలే. రెజ్లింగ్ వైపు అడుగు వేసిన సమయంలోనే కన్నవాళ్లను కోల్పోయిన అమన్.. మూడు పూటలా తిండికోసం ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. 'కొన్నిసార్లు తిండికి, శిక్షణకు పైసలు ఉండేవి కావు.

ఆ కష్ట కాలమే నన్ను ఎంతో బలంగా మార్చింది. అప్పుడు ఒలింపిక్ పతకం గెలిస్తే నా ఆర్థిక పరిస్థితి మెరుగవుతుదని నాకు అనిపించింది. అందుకని విశ్వ క్రీడల్లో పోడియం మీద నిల్చోవడమే లక్ష్యంగా పగలూ, రాత్రీ కుస్తీ పట్టేవాడిని' అని అమన్ తెలిపాడు.

అంతేకాదు ఒలింపిక్ విజేతగా తనకు దక్కిన గౌరవ మర్యాదలు చూసి ఆశ్చర్యపోయానని ఈ యువకెరటం అన్నాడు. 'విమానాశ్రయంలో నాకు స్వాగతం పలికేందుకు చాలామంది వచ్చారు. ఛత్రసాల్‌లో ప్రతిఒక్కరూ చాలా హ్యాపీగా ఉన్నారు. కొందరైతే జోష్‌గా డాన్స్‌లు చేశారు. ఒలింపిక్ పతకం సాధిస్తే దేశ ప్రజలు ఈ తరహాలో ఆనందిస్తారని నేను ఊహించలేదు' అని అమన్ వెల్లడించాడు.

**భావి రెజ్లర్లకు స్ఫూర్తి**

21 ఏండ్లకే ఒలింపిక్ పతకం కలను నిజం చేసుకున్న అమన్ భావి రెజ్లర్లకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. అరంగేట్ర విశ్వ క్రీడల్లోనే మెడల్ కొల్లగొట్టిన ఈ యువ రెజ్లర్ ప్రమోషన్ సాధించాడు. ఉత్తర భారత రైల్వేస్ అతడిని ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా(ఓఎస్డీ) ప్రమోట్ చేసింది.

ఒలింపిక్ ట్రయల్స్‌లో టోక్యోలో రజతం గెలిచిన రవి దహియాను మట్టికరిపించిన అమన్.. పారిస్‌లో పతకంతో మెరిశాడు. 57 కిలోల విభాగంలో తన ఉడుంపట్టుతో దేశానికి ఐదో కాంస్యం అందించాడు. 10 గంటల్లోనే 4.6 కిలోలు తగ్గిన అమన్ పతకంతో గర్జించాడు. దాంతో, 2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి ప్రతిసారి విశ్వ క్రీడల్లో రెజ్లర్లు పతకాలు సాధిస్తున్న ఆనవాయితీని అమన్ కొనసాగించాడు.

# అత్యుత్తమ వికెట్ కీపర్ ధోనీ.. మిగతా ఇద్దరూ వీళ్లే..?



ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ ఆడం గిల్‌క్రిస్ట్ పేరు వింటే చాలు విధ్వంసక ఇన్నింగ్స్‌లే గుర్తుకొస్తాయి. వికెట్ కీపర్‌గానూ తన ముద్ర వేసిన గిల్‌క్రిస్ట్ తాజాగా టాప్ 3 వికెట్ కీపర్ బ్యాటర్లు ఎవరో చెప్పాడు.

భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ మేటి వికెట్ కీపర్ అని ఆసీస్ లెజెండ్ అభిప్రాయ పడ్డాడు.

'ఆసీస్ దిగ్గజం రొడ్నీ మార్ష్ ప్రపంచంలోనే అత్యుత్తమ వికెట్ కీపర్ బ్యాటర్. అతడు నా ఆరాధ్య క్రికెటర్. ఇక ఎంఎస్ ధోనీ కూడా గొప్పవాడే. అతడి ప్రశాంతత నాకు నచ్చుతుంది. మైదానంలో మిస్టర్ కూల్ కెప్టెన్‌గానే ధోనీ ఎన్నో అద్భుతాలు చేశాడు. ఇక మూడో క్రికెటర్ ఎవరంటే.. కుమర సంగక్కర . బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా సంగక్కర ఎంతో స్టయిలిగా కనిపిస్తాడు' అని గిల్‌క్రిస్ట్ వెల్లడించాడు. రొడ్నీ మార్ష్ అంతేకాదు నవంబర్‌లో కంగారూల గడ్డపై జరుగబోయే బోర్డర్ %-% గవాస్కర్ ట్రోఫీ పై కూడా గిల్‌క్రిస్ట్ స్పందించాడు. ఈసారి తమ జట్టు విజేతగా నిలుస్తుందని అతడు జోస్యం పలికాడు. 'స్వదేశంలో తాము ఎంత శక్తివంతులమో నిరూపించాల్సిన బాధ్యత ఆసీస్‌పై ఉంది. మరోవైపు భారత జట్టుకు విదేశాల్లో సిరీస్‌లు ఎలా గెలవాలో బాగా తెలుసు. అయితే.. కమిన్స్ సేన సిరీస్ విజేత అవుతుందని నా నమ్మకం. కానీ, ఇరుజట్ల మధ్య తగ్గ పోరు ఉండడం ఖాయం" అని గిల్‌క్రిస్ట్ తెలిపాడు. ఈ ఏడాది నవంబర్ 26వ తేదీన బోర్డర్ %-% గవాస్కర్ ట్రోఫీ మొదలవ్వనుంది. 2017 నుంచి ఈ ట్రోఫీని గెలుస్తూ వస్తున్న టీమిండియా మళ్లీ ఆస్ట్రేలియాకు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉంది.

# యూఏఈలో టీ20 ప్రపంచకప్.. బంగ్లాదేశ్ నుంచి తరలించిన ఐసీసీ

దుబాయ్: తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీ వేదిక బంగ్లాదేశ్ నుంచి యూఏఈకి మారింది. ఈ విషయాన్ని ఐసీసీ మంగళవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. అక్టోబర్ 3 నుంచి 20 వరకు బంగ్లాలో జరుగాల్సిన ఈ మెగాటోర్నీలో ఆడేందుకు సభ్యదేశాల క్రికెట్ బోర్డులు ససేమిరా అనడంతో ఐసీసీ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. 'ప్రస్తుతమున్న పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లో టీ20 ప్రపంచకప్ నిర్వహణ సాధ్యం కాదు. అక్కడ ఆడేందుకు క్రికెటర్లు, ఆయా దేశాల బోర్డులు ఆసక్తి చూపించడం లేదు. ఈ కారణంగాయూఏఈకి మార్చాల్సి వచ్చింది' అని ఐసీసీ సీఈవో జెఫ్ అలార్‌డైస్ పేర్కొన్నాడు.

# బాలీవుడ్‌లో యువరాజ్ సింగ్ బయోపిక్.. ప్రొడ్యూస్ చేయనున్న టీ సిరీస్..

బాలీవుడ్‌లో ఇప్పటికే పలువురి క్రికెటర్ల బయోపిక్స్ వచ్చాయి. భారత మాజీ కెప్టెన్లు కపిల్‌దేవ్, అజారుద్దీన్, సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ జీవిత కథ ఆధారంగా సినిమాలు తెరకెక్కగా..

ఇందులో పలు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. తాజాగా మరో క్రికెటర్ బయోపిక్ వెండితెరపై ఆవిష్కృతం కానున్నది. ఆ ఆటగాడు మరెవరో కాదు యువరాజ్ సింగ్. టీమిండియా మాజీ ఆటగాడు జీవితం ఆధారంగా మూవీని చిత్రీకరించనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్టును భూషణ్ కుమార్, రవి భాగ్ చంద్క సంయుక్తంగా నిర్మించనున్నారు. అయితే, చిత్రం పేరును ఇంకా ఖరారు చేయలేదు. మూవీలో యువీ జీవితంలోని విభిన్న ఘట్టాలను సినిమాలో చూపించనున్నారు. బయోపిక్‌కు ఇంకా పేరుపెట్టలేదు. ఇందులో హీరో ఎవరు.. ? ఎవరు దర్శకత్వం వహిస్తారు..? అనే వివరాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటించనున్నట్లు అనేది కూడా ఇంకా వెల్లడించలేదు.

త్వరలోనే అన్ని వివరాలు తెలియరానున్నాయి. డీటెయిల్స్ ఇవి చెప్పకుండా.. యువరాజ్ బయోపిక్ త్వరలో తీస్తామని నిర్మాతలు భూషణ్ కుమార్, రవి భాగ్ చందక ప్రకటించారు. ఇద్దరు మేకర్స్‌తో యువి ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. 13 సంవత్సరాల వయసులో క్రికెట్ బ్యాట్ పట్టిన యువీ తొలుత పంజాబ్ అండర్-16 జట్టు తరఫున బరిలోకి దిగాడు. 2000 సంవత్సరంలో అండర్-19 ప్రపంచకప్ ఆడారు. ఇక అదే ఏడాది కెన్యాతో జరిగిన మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. మిడిలార్డర్ బ్యాటర్‌గా, ఆల్‌రౌండర్‌గా భారత జట్టుకు సేవలందించాడు. యువరాజ్ సింగ్ 2007 ఐసీసీ %ు%20 ప్రపంచ కప్, 2011 ఐసీసీ ప్రపంచ కప్ సాధించడంలోనూ యువరాజ్ కీలకపాత్ర పోషించాడు. 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 40 టెస్టులు, 304 వన్డే, 58 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 2012లో చివరిగా టెస్టు మ్యాచ్, 2017లో ఆఖరి వన్డే, టీ20 మ్యాచ్ ఆడాడు. 2011 వరల్డ్‌కప్ అనంతరం ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడిన యువీ.. అమెరికాలో చికిత్స తీసుకుని కోలుకున్నాడు. మూవీలో సినిమాలతో పాటు క్యాన్సర్‌పై పోరాటాన్ని చూపించనున్నారు. యువీ బయోపిక్ ప్రకటన నేపథ్యంలో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**